13. చక్రి

ఏదో పాఠం చెప్తున్నాడన్నమాటేకాని రామదాసు మనస్సు మనస్సులో లేదు. తను చెప్పే పాఠం తనకి అర్థంకాకపోతున్నా క్లాసులో కుర్రవాళ్ళు గురువుగారి ఆందోళనను గుర్తించి కాబోలు కూర్చొని తలలూపుతూ తమకు పాఠం బాగా అర్థమైనట్టు నటిస్తున్నారు.

చంద్రమతి తన ఏకైకపుత్రుడు లోహితుణ్ని తీసుకుపోవటాన్ని గూర్చి చెప్తున్నాడు. ఇంక చెప్పలేక కళ్ళు నీళ్ళతో నింపాడు. కుర్రాళ్ళు కూడా బిక్క మొగాలతో దుఃఖాన్ని నటిస్తున్నారు. చంద్రమతి తనలాటి దౌర్భాగ్యురాలే కాబోలు! తను కూడా వరసాగ్గా నలుగుర్ని మోసుకుపొయ్యాడు. పాఠంమీది ధ్యాస అంతా విషయాల్ని తరచటంలోకి పరుగెత్తింది.

ఇంటి దగ్గర్నుంచి మళ్ళీ చీటీ వొచ్చింది! మీరు రావాలి. చక్రి బతకడేమో, నాకు భయం వేస్తోంది.

మొదటి రెండు కబుర్లకూ తను ఎల్లాగో మనసు చిక్కబట్టుకొన్నాడు. కాని యీ మూడోదాంట్లో వున్న పదాలు ఆయన హృదయానికి కరకు ములుకులయి చక్రి బతకడేమో! అని లోపల గొణుక్కొని దృష్టి ఇంటివైపు మరల్చాడు. చేతిలోవున్న పుస్తకం దానంతటదే జారి కిందపడ్డది. ఎదురుగుండా వున్న ముసలి గోడగడియారం వైపు చూశాడు. మెల్లిగా ఊగుతూ కాలాన్నే మందగమనంతో లాక్కుపోతోంది. ఇంకా గంటంపావుదాకా ఆ కుర్చీని వదలరాదు. ఆ గడియారానిక్కూడా తనమీద దయరాదు. ఏమో ఆలోచించి అన్నాడు: "మీరు ఇళ్ళకు వెళ్ళండి..."

మరి రెండు నిమిషాలకు రామదాసు ఒక్కడే క్లాసులో నిలబడ్డాడు.

మెల్లిగా ఉత్తరీయాన్ని తీసుకొని కళ్ళ నీళ్ళు తుడుచుకొని, బరువైన బొందిని లాక్కుంటూ బైటపడ్డాడు.

చెరువుగట్టున నడుస్తూన్న హరి "కక్కా! అల్లావున్నావేం?" అనేదాకా, రామదాసు ముఖం పైకెత్తనేలేదు.

రామదాసుకు ఒక్కసారి పోయిన ప్రాణం లేచొచ్చినట్టయి, నవ్వేందుకు వ్యర్థప్రయత్నంచేసి, "హరీ! ఎక్కడున్నావయ్యా.. యీ అయిదు రోజులూను?" అన్నాడు.

ఆయన ముఖంలోని వ్యాకులతను అర్థం చేసుకునేందుకు ప్రయత్నిస్తూ హరి అన్నాడు.. "స్నేహితుడి పెళ్ళికి వెళ్ళా?.."

"నీ యీ స్నేహితులమాట మరిచేపొయ్యావా?" అని తన కష్టాన్ని చెప్పుకోలేక భార్య రాసిపంపిన చీటీని హరి చేతికిచ్చాడు.

హరి దాన్ని చదివి చకితుడై, "ఇంతకుముందే వొచ్చాను కక్కా! నాకీ సంగతే తెలీదు. రా... వెళ్దాం" అంటూ నడక సాగించాడు.

2

భర్తనూ, హరినీ చూడగానే భైరవాంబ.. కొడుక్కు విసురుతూన్నదల్లాలేచి, విసనికర్రను అవతలుంచి, "హరీ! వొచ్చావా... నాయనా! భగవంతుడు నిన్ను ఇప్పుడు పంపాడా? నీ పాదాలమీద పడతాను... ఏనాటికైనా నీ రుణం తీర్చుకుంటాను! ఈ జన్మాన చేతకాపోతే వెయ్యి జన్మాలు కుక్కనై నీ ఇల్లు కాచి రుణవిముక్తురాల్నవుతాను– నీ కడుపున పుడతానుబాబూ... ఈ ఒక్కణ్ణీ బతికించు; నీ చిన్నతమ్ముడికి ప్రాణంపొయ్యి బాబూ!" అని వలవలా ఏడ్వసాగింది.

"నన్నేమనుకుంటున్నావ్... పిన్నీ! నేనేం భగవంతుణ్ణి కాదు... నా పాదాలమీద పడటానికి. నీకు మతిపోతోందా పిన్నీ... ఇలాటి మాటలంటే నేనిప్పుడే బైటికిపోతాను."

రామదాసు హరి రెండు చేతుల్నీ పట్టుకొని, "ఇవ్వే కాళ్ళనుకో హరీ! మరేమీ అనుకోకు..." అన్నాడు.

ఆ దంపతులకు వారి మాటల్లో ఏమైనా మాధుర్యం వుందని తోచిందేమోకాని... హరి హృదయానికి మాత్రం అవ్వి బాకుల్లాగు స్ఫురించాయి.

"నాకు సిగ్గవుతోంది... మీరు నన్నేమీ కోరక్కర్లేదు బతిమాలక్కర్లేదు! ప్రాధేయపడక్కర్లేదు. నాకు తెలుసు చక్రికి సేవచేయవలసిన బాధ్యత. ఇదే చెప్తున్నాను. మీరు మరోసారి ఇల్లా అంటే మాత్రం– నేను సహించలేను."

"సరే బాబూ- నిన్నే నమ్ముకున్నాం" భైరవాంబ అన్నది.

హరి మాట్లాడకుండా వెళ్ళి రోగి మంచంమీద కూర్చున్నాడు. ఐదు రోజుల్లోనే చక్రిలో ఇంత మార్పా? వాడి ముఖంలోని కళా, కాంతీ వికాసమూ ఏమైనాయి? ముఖమంతా పాలిపోయి గుర్తించేందుకు వీల్లేని ఆకారాన్ని తాల్చింది. చక్రి విడిచే ఉష్ణవాయువులు హరిచేతిని సోకుతున్నాయి. వాడి ఫాలభాగంమీద మోపిన చేతికి జ్వరతీవ్రత తెలుస్తూనేవుంది.

"చక్రీ !" అన్నాడు మెల్లిగా - నీరసించిన వాడి శరీరాన్ని తాకుతూ.

చక్రి మెల్లిగా కళ్ళు తెరిచి, ఏదో మాట్లాడబోయి పెదిమల్ని నాలికతో తడిచేసుకొని, జాలిగా, బాధగా, దీనంగా హరివైపు చూసి- మౌనంతోనే వినయంగా కనురెప్పల్ని వాల్చాడు.

హరి రోగిని పరీక్షించాడు. అనేక ఊహలు అతనిలో మెరుపుల్లా మెరిసాయి ! ఈ విషజ్వరాన్ని గూర్చి అతను జ్ఞాపకం చేసుకుంటున్నాడు.

రామదాసూ, భైరవాంబ ముఖాల్లోని ఆతృతను కనిపెట్టి అన్నాడు: "మరేం భయంలేదు పిన్నీ ! అనవసరంగా ఆశలన్నింటినీ చంపుకొని ఆదుర్దా పడుతున్నారు- ఇప్పుడే వెళ్ళి మందు తీసుకొస్తా."

మెల్లిగా లేచివెళ్తున్న హరిని భైరవాంబ లోలోన దీవించింది.

రామదాసు అన్నాడు. "హరి ఇంత మంచివాడూ, జాలి గలవాడూ అనుకోలే. ఏదో చిన్నతనంలో నా దగ్గర చదువుకొన్నాడు, నేనంటే భయభక్తుల్తో కూడిన గౌరవాన్ని చూపుతాడు. వాడి తండ్రి పెంపుడుపోయి పెద్ద ఆస్తిని ఆర్జించినా- ఇంత నమ్రత చూపుతాడనుకోలే-"

భార్య అంది. – భగవంతుడికి మనమీద దయవుంది." ఎదురుగుండా గోడమీద వేలాడుతూవున్న విష్ణువు బొమ్మను ఉద్దేశించి ఆమె లోలోపల, "దయారహితుడివై మాతృత్వాన్ని భగ్నంచెయ్యబోకస్వామీ ! వాడి బాధ చూచేందుకు మాత్రమే నన్ను బతికించొద్దు. నలుగుర్ని ఇచ్చావ్- లాక్కున్నావ్. ఈ వొక్కణ్నీ మాత్రం మిగుల్చు తండ్రీ ! వాడి బదులు- నన్ను- చంపు, వాడి బాధను నా కివ్వు సహిస్తాను. నా చేతుల్లో అల్లారుముద్దుగా పెరిగిన వాడికి మాత్రం ఆ బాధవొద్దు- నా సర్వస్వమూ వాడే! నేను చెప్పాలా? తెలీదా నా హృదయం నీకు?" అనుకొని కంటనీరు కార్చింది.

హరి తిరిగి వొచ్చి కూర్చొని, "ఇన్నాళ్ళనుంచీ మందేమీ ఇవ్వలేదా?" అని అడిగాడు.

భైరవాంబ పొడి గొంతుకతో అంది. "అప్పలాచారి ఇచ్చాడు. ఇదేం రోగమోకాని తిరుగుముఖం పట్టకపోను- రోజురోజుకూ అధికమౌతోంది. ఏమిటో- వాడి బాధ!

మాట్లాడడు. చెప్పడు. ఎవరైనా వొచ్చి పేరుపెట్టి పిలిచినా, లేపినా- మెల్లిగా కనురెప్పలకిందనుంచి చూసి మళ్ళా మూస్తాడు. ఉన్నట్టుండి అమితంగా కాళ్ళుచేతులూ కొట్టుకుంటాడు."

"ఆహారం యేమీ ఇవ్వలేదా?"

"వైద్యుడు ఇవ్వొద్దన్నాడు-"

దారినే పోతూన్న జానికయ్యను పిల్చి హరి, "నా సైకిలేసుకొని వెళ్ళి ఈ చీటీలోరాసిన మందునూ, ఒక డజను బత్తాయిల్నీ తీసుకురా, ఇక్కడున్నట్లు రావాలి-" అని జేబులోంచి పదిరూపాయిల కాగితాన్ని తీసి జానికయ్యకు ఇచ్చాడు.

భైరవాంబ చేతిగాజుల్ని తీస్తూ అంది: "ఒద్దు హరీ, నువ్వొద్దు- జానికయ్యా. ఇవిగో యీ గాజుల్ని తీసుకువెళ్ళి తాకట్టుపెట్టి తీసుకురా- లేకుంటే అమ్మేయ్- తెగనమ్ము. ఎంతొచ్చినా సరే-"

తన గ్రాంటు ఇంకా కాలేదేమా అని రామదాసు ఆలోచిస్తున్నాడు. "నేనేం చెప్పాను పిన్నీ- మళ్లీ మొదటికే వస్తున్నావ్-" అన్నమాటలు భైరవాంబ సాహసాన్ని అరికట్టాయ్- జానికయ్య వెళ్ళాక.

"హరీ! ఈ పది రోజుల్నుంచీ మాకు నిద్రాహారాలు లేవు. కళ్ళెలా ఎర్రపడ్డయ్యో చూడు. నాకేదో భయంవేస్తోంది. మీ ఉమాపతీ వైద్యం మీద నమ్మకం వుంది. నీమీదే నా ఆశలన్నీ ఉన్నాయ్......" అంటూ భైరవాంబ కొడుకు పక్కలో కూర్చొని విసరనారంభించింది. రామదాసు చెయ్యివిరిగిన కుర్చీలోనే కూర్చొని తలొంచుకొని అశ్రువుల్ని రాలుస్తున్నాడు.

"మరేం భయంలేదులే పిన్నీ!" అని హరి మరో మంచం మీద కూలబడ్డాడు.

ఇల్లంతా నిశ్శబ్దంతో ఒక గంట గడిచింది. ఎక్కడి మనుషులక్కడ నిశ్శబ్దంగా కూర్చున్నారు. భైరవాంబ కంటినుంచి ఏకధారగా కారే నీరు కుర్రవాడి ఫాలభాగాన్ని తడిపేస్తోంది.

ఇప్పటికి జానికయ్య తెచ్చినమందును- సిరంజ్‌లోకి ఎక్కించటంలో హరి నిమగ్నుడై వున్నాడు.

ఉన్నట్టుండి చక్రి కాళ్ళూ చేతులూ కొట్టుకోసాగాడు. భైరవాంబ వాణ్ని గట్టిగా కావిలించుకుంటూ, "ఏం నాయనా?" అంది.

హరి అదిరిపడి రోగి మంచం దగ్గరకు పరుగెత్తాడు. తల తెగిపడ్డ జంతువు మొండెంలాగు చక్రి కొట్టుకుంటూన్నాడు. ఈ దృశ్యాన్ని చూడలేక రామదాసు రెండు కళ్ళనూ గట్టిగా మూసుకున్నాడు. చక్రి చెయ్యిపట్టుకు చూశాడు. నాడి అందకుండా ఎగబ్రాకిపోతోంది. హరికి యేమీ పాలుపోకుండా వుంది. ఎగశ్వాసతో చక్రి యీ

లోకాన్ని కడసారి చూసి, తుదిసారి యీ గాలిని పీలుద్దామనీ వ్యర్థప్రయత్నంచేసి- అందరికీ నమస్కరిస్తూ కళ్ళను శాశ్వతంగా మూశాడు. ఆ నిర్జీవ శీతల శరీరాన్ని స్పృశింపలేక హరి చేతిలోని సిరంజిని వదిలేశాడు.

భైరవాంబ, "నాయనా - నాయనా-" అంది. ఎవరున్నారు సమాధానం ఇచ్చేందుకు? హరి తల వాల్చి ఇవతలికి వొచ్చాడు.

భార్య మాటల్లోని దుఃఖాన్ని విని, రామదాసు కళ్ళు తెరిచి పరిస్థితి గ్రహించి "పొయ్యాడా?- హరీ!....... పొయ్యాడా- నా బాబు? ఎంత గారాబంగా పెంచాం- హరీ! మాట్లాడవేం? ఇంతేనా- యీ జన్మకు?" అని లోలోపలే విలపించసాగాడు.

భైరవాంబ పూర్తిగా మతిలేనిదానిమల్లే గోడమీద విష్ణువు బొమ్మను ఉద్దేశిస్తూ-

"నలుగుర్ని పొట్టను పెట్టుకున్నావ్- చాల్లేదా? మమ్ముల్ని ఏడిపిస్తే కాని నీకు సంతోషం కాదా? నిన్ను నమ్మామే! నిన్ను పూజించామే! వాడు- నాతోపాటే నీకు పూజ చేసేవాడే! వాడు నీ మెడలో ఐదు రోజుల క్రితం వేసిన పూలదండ ఇంకా వుందే- కళ్ళు పొయ్యాయా నీకు? చూడు- నీ పూజకోసం వాడు నాటిన పూలమొక్కల్ని. తీసుకుపొయ్యేవాడివి ఎందుకిచ్చేవ్? వాడి బదులు నన్ను చంపమన్నానే! వాడికి నీ పేరు పెట్టుకోలే? అంతా అంతా- మరిచిపోయి.... కృతఘ్నుడవై.....వాణ్ని.... ఆ చిన్నివాణ్ని చంపకపోతే....... ఛీ! నిన్నా నమ్మటం? దిగు- ఆ గోడ మీంచి-" అని రోషంగా బొమ్మను తీసి అద్దం పగులకొట్టి, కాగితాన్ని ముక్కలు ముక్కలుగా చింపి కాలితో రాచింది.

కోపం చల్లారగానే మళ్ళీ యీ వాతావరణానికి లొంగి వెంటనే కొడుకు దగ్గరకు పరుగెత్తి, ఆ శవాన్ని కదుపుతూ, "నాతండ్రీ! నిన్నెవరేమన్నార్రా? నీకేం తక్కువ చేశామని మమ్మల్ని దిగతొక్కిపోయావ్! ఒక రోజు కాదు- ఒక నెలకాదు- ఒక ఏడు కాదు- పదేళ్ళు పడరాని పాట్లుపడి పువ్వుల్లోపెట్టి పెంచినందుకా యీ శిక్ష! ఈ ప్రపంచంలో యీ పదేళ్ళ పాపకే తావులేక పోయిందా? ఇన్ని పర్వతాల్నీ ఇన్ని నదుల్నీ మోస్తున్న భూమాతకు వీడొక్కడే భారమైనాడా? ఎవరి జోలికీ పోని, ఎవరికీ ఏ హానీ చెయ్యని- ఏ పాపమూ ఎరగని పసిపాప- వీడొక్కడే దేవుడి దృష్టికి దూరమైనాడా? నా చిట్టి తండ్రీ! ఇక ముందు నువ్వులేక మేమెల్లా జీవిస్తాముర బాబూ- నా కడుపు కాల్చిపొయ్యాడు-" అని జుట్టంతా పీక్కుంటూ ఏడ్వసాగింది.

రామదాసుకూడా ఉత్తరీయం చాటున ఏడ్వ నారంభించాడు. హరికి కన్నీరాగటంలేదు. భైరవాంబ కేకలకు ఇరుగు పొరుగులు పరుగెత్తుకొచ్చారు. అందరూ తలో విధంగానూ సానుభూతి చూపటం మొదలెట్టారు.

ఇప్పటికే సాయింత్రం నాలుగు గంటలైంది. సూర్యుడు తీక్షణతను క్షీణింపజేసుకుంటూ- మెల్లి మెల్లిగా పశ్చిమాద్రిని ఎగబ్రాకుతున్నాడు. ఏడ్చీ ఏడ్చీ

భైరవాంబ ముఖమంతా కందిపోయింది. రామదాసుకు దుఃఖంతో నోరు పిడచగట్టుకుపోతోంది.

మెల్లిగా హరిని అవతలికి పిలిచి రామదాసు అన్నాడు. "హరీ! వాడు నన్ను జీవచ్ఛవాన్ని చేసిపోయ్యాడు. ఒక్క పని చేసిపెట్టు నాయనా- చేతుల్లో నలుగుర్ని పెంచాను. అందర్నీ భూదేవి గర్భానికి బలిపెట్టాను. ఇంక నేనివన్ని చెయ్యలేను. ఈ పెంచిన చేతుల్తోనే వాడి శరీరాన్ని గోతిలో పెట్టి కాలితోతొక్కి మలినంచేసిన మట్టితో దాన్ని పూడ్చలేను హరీ. నువ్వేం చేసినా సరే! వాడి కళేబరాన్ని కుక్కలూ, నక్కలూ పీక్కుతిన్నా నా కిష్టమే! ఎల్లాగైనా దాన్ని బైటికి పంపేమార్గం చూడు బాబూ! మొఖాన రాసిన గీతను ఎల్లా చెడుపుకుంటాం? నాకు నేనే సమాధానం చెప్పుకోలేకుండా వున్నాను. మీ పిన్నిని సమాధానపరచటంకూడా నీ వొంతే-"

"అదంతా నేను చూస్తాను కాని- కక్కా- నువ్వే ఇల్లా దుఃఖిస్తే పిన్ని గతేం కావాలి?"

రామదాసుకు మొలబంటి దుఃఖంలో మోకాటిబంటి సంతోషం కలిగి, తల ఊగించాడు.

ఇప్పటికే స్కూలు కుర్రాళ్ళుకూడావొచ్చి, తమ స్నేహితుడికోసం కన్నీరు కార్చారు.

చక్రి మృతశరీరాన్ని తీసుకుపోతుంటే, భైరవాంబ అమితంగా విలపిస్తూ, "ఎంతమంది వుండి ఏం చెయ్యగలరు! నా బాబు! చూడు ఆదుకునేందుకు ఎంతమంది స్నేహితు లొచ్చారో! కని పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులే అక్కర్లేనప్పుడు - స్నేహితులెందుకు?... వెళ్తావా! నా తండ్రి,,, ఇంక కనపడవా? ఎన్నాళ్ళు పెంచాను; నన్నూ, నాన్ననూ... అందర్నీ విడిచిపోతావా..." స్పృహతప్పినట్టు నేల వ్రాలింది.

3

హరి రాకను చూసి పాలిపోయిన ముఖంలోంచి ఒక వేడి నిట్టూర్పును విడుస్తూ రామదాసు "అయిందా నాయనా? ఆ శ్మశానగర్భంలో వాణ్ని భద్రంగా పడుకోబెట్టి మళ్ళీ పైకి రాకుండా చేశావా?" అన్నాడు.

హరి మౌనంతోనే మెల్లిగా తల వూపాడు.

అప్పటికి భైరవాంబ మళ్ళీ యీ లోకంలో మనిషయింది. పూర్తిగా దుఃఖంతో పూడుకుపోయిన ఆమె గొంతు నుంచి మాటలు సరిగ్గా ఉచ్చరింప బడటంలేదు.

"హరీ; ఇంక నేను ఏడ్వలేను. కడుపులో పెట్టుకు పెంచాను. దేవుడేవొచ్చి తనకు బలివ్వమన్నాడు. మాట్లాడకుండా చేతులారా ఇచ్చేశాను-" అని భైరవాంబ రెండు కళ్ళనూ గట్టిగా మూసుకుంది.

ఇప్పటికి ఇరుగు పొరుగులంతా సర్దుకున్నారు. ఒక పావుగంటదాకా ఇంట్లో నిశ్శబ్దదేవత తాండవించింది. పూర్తిగా అస్తమించిన సూర్యుణ్ణి నెట్టేస్తూ సందెచీకట్లు అలముకోసాగాయి. నక్షత్రాలు ఒక్కొక్కటిగా తమ మిణుకు మిణుకు కాంతితో ఆకాశంలోంచి తొంగి చూస్తున్నాయి.

హరి లాంతరు వెలిగిస్తూ అన్నాడు: "కక్కా! చీకటి పడ్డది! భోజనం తయారుచెయ్యమని ఇంటికి కబురంపాను. ఇప్పటికి సిద్ధమై వుంటుంది; స్నానం చెయ్యండి; వెళ్దాం..."

రామదాసు దీర్ఘంగా గట్టిగా నిట్టూర్చి, "నాకు ఆకలి కావటంలేదు బాబూ" అన్నాడు! భైరవాంబ అంది. "చక్రి తినకపోతే మాకు అన్నం సయిస్తుందా బాబూ! ఈనాటినుంచి వాడు లేకుండా బతకటమే భారమైపోతోంది."

"అన్నీ మరిచిపోవాలి పిన్నీ! బతికినన్నాళ్ళూ - పొట్ట వున్నన్నాళ్ళూ- ఆకలి తప్పదు. మీ పాదాల మీద పడతాను.. నన్ను కాదనకండి. నా మీద మీకేమైనా ప్రేమ వుంటే - దాన్ని చూపవలసిన సమయమిదేనని చెప్తున్నాను."

❋ ❋ ❋

నీరు కారుతూన్న కళ్ళతోనే నాలుగు మెతుకులు నోట్లో వేసుకొని ఆరాత్రికి వారెల్లాగో ఆకలిబాధ తీర్చుకున్నారు.

హరి అన్నాడు: "ఈ రాత్రి నేను కూడా ఇక్కడే పడుకుంటూ..."

భైరవాంబ, "పడుకో బాబూ... ఆ మంచం మీద చక్రి రోజూ పడుకునే మంచంమీద పడుకో. ఈనాటినుంచీ దానిమీద ఎవరు పడుకుంటారా అని చూస్తున్నా...." అంది. మాట్లాడకుండా హరి మంచం వాల్చుకు పడుకున్నాడు.

ఉన్నట్టుండి భైరవాంబ చీరచెంగు నేలమీద పరుచుకు పడుకొని వెక్కి వెక్కి ఏడుస్తూ దొర్లనారంభించింది.

హరి లేచి కూర్చొని అన్నాడు: "ఇదుగో పిన్నీ - చెప్తున్నాను. పోయినవాళ్ళు పోగా ఇదంతా ఉన్నవాళ్ళ చావుకు వొచ్చినట్టుంది. కటిక నేలమీద పడి దొళ్ళటం దేనికి? నువ్వక్కడ పడుకుంటే నేను ఇక్కడ యీ నేలమీద పడుకోవాల్సి వుంటుంది..."

"నన్ను ఏడ్వనీ నాయనా! హృదయంలో ఇంత దుఃఖం ఇమడటం లేదు... ఇదంతా కన్నీటి రూపంలో వెలువడనీ బాబూ! నాకు మంచంమీద నిద్రపట్టదు. ఇక్కడే పడుకోనీ... నన్ను కాదనకు హరీ!" అని భైరవాంబ స్థిమితంగా ఒత్తిగిలి పడుకొంది. మరేమీ మాట్లాడకుండా హరి గట్టిగా ఊపిరి పీల్చి మేనువాల్చాడు.

రామదాసుకి వీళ్ళెవరి గోలా పట్టనట్టు పడుకొని ఇంటి చూరును చూస్తూ ఏదో దీర్ఘంగా ఆలోచించసాగాడు. ఆయనకు పూర్తిగా మతిభ్రమ కలిగినట్టుంది. దాదాపు

అర్ధరాత్రివరకూ ఆయన ఆలోచనాసాగరంలోని ఏ అలా ఒడ్డుజేరనేలేదు. ఊరంతా మాటుమణిగినా పొలాల్లో నక్కలు కూసే భయంకర నాదాలూ, అమిత వేగంతో వీస్తూన్న ఈదురగాలి చెట్ల కొమ్మల్లోంచి దూసుకుపోతూ చేసే శబ్దమూ విన్పిస్తూనే ఉన్నాయి. బైట కారుచీకట్లు క్రమ్ముకొన్నాయి. రామదాసు ఇది తన పాలిట కాళరాత్రి కాబోలు ననుకున్నాడు.

అటూ ఇటూ దొర్లుతూ బలనంతాన్నైనా నిద్రాదేవిని లాక్కుందామని ప్రయత్నించాడు కాని.. రామదాసుకు ఆమె భయపడి దూరదూరంగా పోసాగింది. తడిసిపోయిన తలగడాను చూసుకుంటూ లేచి కూర్చున్నాడు.

భైరవాంబ సొమ్మసిల్లి నిద్రపోయింది. హరి మేలుకున్నాడో లేదో కాని అతని కళ్ళుమాత్రం మూసేవున్నాయి. మరో లాంతర్ను వెలిగించుకొని... రామదాసు... పక్కగదిలోకి వెళ్ళాడు.

చక్రి చదువుకునే పుస్తకాలు చిందరవందరగా పడివున్నై. ఒక్కొక్కటే తీసి బొత్తిగా పెట్టాడు. ఆ పుస్తకాల్ని సర్దుకునేవారుకానీ, అంత మంచి దస్తూరి రాసే హస్తం కానీ ఇంక లేదు! ఆ చాపమీద కూర్చొని ఇంకెవరు చదువుకుంటారు? గోడ మీద పెన్సిల్‌తోనూ, కిటికీ చెక్కమీద సీమసున్నంతోనూ చక్రి రాసుకున్న పేర్లు ఇంకా కన్పిస్తూనే వున్నాయి. పెట్టెలోకి పోకుండా, ఇంకా పెట్టె మీదనే కూర్చున్న చక్రి లాగులూ... వాడు మనసుపడి కొత్తగా కుట్టించుకొన్న కోటూ, ఆ దొరటోపీ... చిన్నప్పుడు వాడు ఆడుకున్న రైలుబండి, తిరణాలలో వాడు కొనుక్కొన్న బుల్లి బూట్సు... అన్నీ మూలుగుతూ కూర్చున్నాయ్. దీపావళి సామానంతా రోజూ కొద్దికొద్దిగా కాల్చుకుందామని వాడు భద్రంగా దాచుకున్న తాటిఆకుల బుట్ట తనను ఎవరూ చూడటంలేదని కాబోలు.. తొంగితొంగి చూస్తోంది.

కిటికీకి ఆనుకొని దొడ్లోకి చూస్తూ రామదాసు వివిధ విషయాల్ని తలంపుకు తెచ్చుకోసాగాడు. ఈనాటి సాయింత్రం వరకూ ఇంట్లోనే వున్న చక్రి ఉన్నట్టుండి మాయమైనాడు; వాడు భోంచేసే ఆ చిన్న వెండిపళ్ళెమూ, వాడి పంచరంగుల సూటుకేసూ ఇంక తుప్పుపట్టవలసిందే!

కిటికీ చీల్చుకొని లాంతరు వెలుగు దొడ్లో వాల్తోంది. చక్రి నాటిన తులసివనం పరిమళాన్ని పంపుతోంది; వాడు నాటిన కాకరపాదు గుబురుగా పెరిగింది. దేవుడి పూజకుగాను ఊరంతా తిరిగి తెచ్చి నీళ్ళు పోసి పెంచిన చంద్రకాంతలూ, సూర్యకాంతలూ, ఎర్రగన్నేర్లూ... తలలు వాల్చి కూర్చున్నాయ్. కన్నార్పకుండా ఆ దొడ్లోకి చూస్తూన్న రామదాసుకు కాకరపాదు సమీపంలో ఒక వ్యక్తి మసులుతూన్నట్టనిపించింది.

రామదాసు అనుకున్నాడు– చక్రి తన వనాన్నీ, గదినీ పుస్తకాల్నీ చూసుకునేందుకు వచ్చాడని... వాడేనా? వాడి ఎత్తునే... వాడిలాగు నడుస్తూనే తిరుగులాడుతున్నాడు... ఆ ఎండుటాకుల మీద నడుస్తూన్న శబ్దమా అదీ?

చచ్చినవాళ్ళు ఎప్పుడైనా, ఎందుకైనా బతికి వొస్తారా? తను భ్రమిస్తున్నానేమోనని కళ్ళు నులుచుకొని చూశాడు. ఇంకా ఆ వ్యక్తి అక్కడే నిలబడ్డట్టుంది.

శూన్యంలోకి చూస్తూ మెల్లిగా అన్నాడు... "చక్రీ.. చక్రీ.. నా కోసం అమ్మకోసం... మళ్ళీ వొచ్చావా నాయనా? ఆగు బాబూ... వొస్తున్నా... ఆ చీకట్లో చలిలో, కాళ్ళకేమీ లేకుండా.. నడవబోక బాబూ... చక్రీ... చక్రీ... వెళ్ళబోక.. ఇదిగో... లాంతరు తీసుకువొస్తున్నా..."

లాంతరు పుచ్చుకొని గబగబా దొడ్లోకి పరుగెత్తాడు. అంతటా పరికించి చూశాడు. ఎవ్వరూ లేరు.. కాకరపాదు మీద ఆరేసిన చక్రి లాగూచొక్కాలు తప్ప. అవ్వి తీసి భుజాన వేసుకొని, "చచ్చికూడా నన్ను మోసం చేసి ఏడిపిస్తున్నాడు–" అనుకొని నిట్టూర్చి నిస్పృహతో మళ్ళీ గదిలోకివొచ్చి ఆ శూన్యంలోకి, అనంత వినిర్మలాకాశంలోకి, చీకటి సముద్రంలోకి– చూస్తూ నిలబడ్డాడు–ఇంకా చక్రి వస్తాడనే ఆశతోనేమో !

అట్లా ఎంతసేపు శిలాప్రతిమలాగు నిలబడ్డాడో కాని– దొడ్లో మరో మూలనుంచి వేదనతో ఏదో చెప్పరాని బాధతో ఆవూ, లేగదూడా కంఠాల్ని కలిపి "అంబా!" అని అరిచేదాకా– రామదాసు ఆ ఇంట్లో వ్యక్తి అవలేకపొయ్యాడు. వెంటనే లాంతరు తీసుకుని వాటిని సమీపించాడు. రామదాసును చూడగానే అవి తోకలెత్తి నోరు తెరిచి, కటిక నేలను కాలితో రాయసాగాయి. రామదాసు– పాపం ! ఎంతసేపు ఇవి ఇల్లా బాధపడుతున్నాయో? దుఃఖంవల్ల వాటిక్కూడా పీకలార్చుకుపొయ్యాయి కాబోలు అనుకొని వాటికి నీళ్ళుపెట్టి గడ్డివేశాడు. దూడ గడ్డిని ముట్టక, తలవాల్చి మూరెడు పొడుగు నాలికతో రామదాసు చేతిని నాక మొదలుపెట్టింది. ఆ దూడ పుట్టంగానే, "అమ్మా! ఇది నాకు– నాన్నా! ఈ దూడ నాది" అని చక్రి దాంతో ఆడుకో మొదలుపెట్టిన ఘట్టం జ్ఞాపక మొచ్చి, దూడ మెడను చేతుల్లో బంధించి దీనంగా దాని కళ్ళల్లోకి చూశాడు. చక్రి తన మెడలోకట్టిన మువ్వలు గలగల్లాడేట్టు అది తల ఆడించి, ఎంతకూ తన యజమాని రాడని కాబోలు– కళ్ళు రెండూ నీళ్ళతో నింపింది! ఆవు కూడా దూడ మెడమీదనుంచి తలమోపి– రామదాసు చేతిని కొమ్ముల్తో రుద్దసాగింది. రామదాసు మెల్లిగా అన్నాడు: "మీక్కూడా తెలుసా– చక్రి ఇంక రాడని? మీకు మేత వేసేవాడూ, సమయానికి నీళ్ళు పెట్టేవాడూ, మీతో మాట్లాడటం తెలిసినవాడూ, మీ మెడలకు తానవశాల్ని తగిలించి మీతోటిదే లోకంగా చూసుకునే మానవ స్నేహితుడు పొయ్యాడని దుఃఖిస్తున్నారా ! ఏ చక్రి మీకు మేతవెయ్యకుండా అన్నం తినేవాడు కాదో– వాడు ఇంక రాడమ్మా– రాడు. ఎందుకు ఏడుస్తారు?" అవి రెండూ

ఆ మాటలు అర్థమైనట్టు- సానుభూతిగా తలలు ఆడించి, వాల్చి నేలను కాలితో రాస్తూ అమిత ఆవేదనతో 'అంబా'!' అని అరిచాయ్! ఆవు దీనంగా జాలిగా బాధగా చూస్తూ ముక్కురంధ్రాల్ని పెద్దవిగా చేసి, నిట్టూరుస్తున్నట్టు వేడిగాడ్పుల్ని బైటికి పంపసాగింది. నేలమీదవున్న ఆహారంతో తనకు నిమిత్తంలేనట్టు- గడ్డినీ జనపకట్టెనూకూడా కాలితో అవతలికి నెట్టేసింది. కొన్ని నిమిషాలపాటు ఆ మూగజంతువుల ముందు నిలబడి వాటితోపాటే కన్నీరు కార్చి- వాటిని తట్టి- రామదాసు ఎల్లాగో ఇంట్లోకి వొచ్చాడు. చక్రి ఇంకా ఎక్కడైనా వున్నాడేమోననే ఆశతో కాలుకాలిన పిల్లిలాగు ఇల్లంతా దేవులాడాడు కాని- ఎక్కడ వున్నాడో ఏ దివ్యజ్యోతిలో లీనమైనాడో- ఎవరికి తెలుసు?

హరి కలతనిద్రలో ఉలిక్కిపడి లేచి......రామదాసు ఆ అర్ధరాత్రి లాంతరుతో ఇంకా తిరుగులాడుతూండటాన్ని చూచి కొంచెం ఆశ్చర్యపడ్డాడు. లేచి కూర్చున్న తనను కూడా గమనించకుండా గదిలో ప్రవేశించిన రామదాసును గూర్చి కొంచెం ఆలోచించి చరచరా గదిలోకి జొరబడి "కక్కా; మరీ పిచ్చివాడివైపోతున్నావ్! ఇంతదుఃఖిస్తే నీ ఆరోగ్యానిక్కూడా ముప్పువొస్తుంది సుమా" అన్నాడు.

రామదాసు గట్టిగా ఊపిరిపీల్చి, కనుకొలకుల్లోని నీటిని గోటితో మీటుతూ అన్నాడు- "నాకు తెలుసు హరీ - ఇంకా యీ ముసలి శరీరంలో మిగిలివున్న కండలూ, రక్తమూ, చీమూ, శక్తి కలిసి యీ కన్నీటి రూపంలో బైటపడుతోందని. నాలో ఇంకా కొద్దికొద్ది మోతాదుల్లో మిగిలివున్న ప్రతి శక్తినీ, ప్రతి అణువునూ వాడు లాక్కుపోయి యీ చర్మపు తిత్తిని మాత్రమే వదిలివెళ్ళాడు! జీవితకాలమంతా జీవనదివలె ప్రవహించటానికి యీ కళ్ళింకా గుడ్డికాకుండా వున్నాయేమో! విషాద బాష్పాలకు తప్ప ఆనందబాష్పాలకు నోచుకోని యీ నేత్రా లెంత పాపం చేశాయో! హృదయంలో వాడు చేసిన యీ కనపడని గాయం ఎప్పటికైనా మానుముఖం పడుతుందనే నమ్మకం నాకు లేదు బాబూ, అయిపోయింది.. కళ్ళకింక నీటిని కార్చేశక్తి! నా చక్రిని బతికించుకోలేక పొయ్యాననే తీరని సమస్యతో, ఆరని ఆవేదనతో ఇంకెంతకాలం తపించి, కృంగి, కృశించి నశించాలో నాకే అగమ్యగోచరంగా వుంది హరీ..."

హరి నిట్టూర్చి అన్నాడు: "నీకు తెలీదా "కక్కా" లోకమంతా ఏకమైనా మృత్యుముఖంలోని వ్యక్తిని బైటికి లాగలేదని ? వైద్యులంటే... రంగునీళ్ళు పోసి కళ్ళ నీళ్ళు తుడిచేవాళ్ళే కాని ప్రాణంపోసే శక్తి వాళ్ళకు లేదని?"

తలతిప్పి, "ఈ దుఃఖానికి హృదయం పగిలేట్టుంది నాయనా! మేంకార్చిన కన్నీటిని కొల్చేపాత్ర వుందా బాబూ! మా వేడి నిట్టూర్పులతో గాలిదేవుడు చలికాచుకున్నాడు. మా కన్నీటి కాల్వలో భూదేవి జలకమాడింది. ఈ ఏకపుత్ర భిక్షకోసం భగవంతుణ్ణి ఎంత జాలిగా ప్రార్థించాము? లేడి కంట నీరు పెడితే - వేటగాడికి; చాలా నిర్దయగా,

నిర్లక్ష్యంగా, క్రూరంగా వాణ్ని చంపి పారేశాడు! ఇంతగా దుఃఖింప జేసేవాడు మాకు మానవహృదయాల్నెందుకివ్వాలి? కరగని, అరగని ఉక్కు హృదయాలివ్వరాదా? భగవంతుడు ఉన్నాడా హరీ? ఉండి నన్ను పరీక్షిస్తున్నాడా! అంతులేదా... యీ విషమపరీక్షకు? నేనేం తప్పుచేశాను? ఏ నేరాన్ని నామీద ఆరోపించాడు? ఆ మొండి జగన్నాథుడికి, శిలాస్వరూపుడికి కంచుకాగడాలు వేసి వెతికినా జాలి, దయా వున్నయ్యా? ఇంత పాపమా నా పూర్వజన్మలోది? ఒద్దు హరీ... ఇలాటి భరించి, సహించలేని కఠినశిక్ష నా గర్భశత్రువుకైనా వొద్దు–" అని ఉద్రేకంతో చెప్పి, కళ్ళు రెండూ మూసుకొని అరచేతుల్తో ముఖాన్ని కప్పుకున్నాడు.

హరికికూడా కంటనీరొచ్చింది. కాని ఎల్లాగో ఆపుకొని పక్కనే పడివున్న సైన్స్ పుస్తకాన్ని తీసి ఆ బొమ్మల్ని చూపుతూ చెప్పాడు: "చూడు కక్కా! మనం ఎవర్ని ప్రేమిస్తున్నాం? ఈ బొక్కబొక్కలుగా వున్న పుర్రెల్నీ, ఈ అస్థిపంజరాన్నీ, యీ ఎముకల పోవుల్నీని! వీటిని కప్పేందుకు రంగు చర్మమూ, ఈ యంత్రాన్ని నడిపేందుకు ప్రాణీ వుంటేనేకాని మానవుడవడే! ప్రేమించగలమా– యీ వికృతరూపాల్ని? నీకు తెలీదా కక్కా? యాభైఏళ్ళ జీవితాన్ని చూశావు– నేను చెప్పాలా? లోకంలో పుత్రుల్లేనివాళ్ళు ఎంతమంది లేరు? అందులో నువ్వొకడివి. పుట్టిన పుత్రులు ఎందుకూ కొరగాకుండా పోతున్నారేనని ఏడ్చేవాళ్ళెంతమంది లేరు! పుట్టినవాళ్ళను పోగొట్టుకొన్న వాళ్లెంతమంది లేరు! చూడు కక్కా! పుట్టేదాకా ఏడుపూ పుట్టాక ఒక ఏడుపూ! గిట్టాక మరో ఏడుపూను! పురుషుడివి– నువ్వే ఇంతగా దుఃఖిస్తే– పిన్ని గతేం కావాలనుకుంటున్నావ్? కన్నతల్లి– తండ్రికన్న బిడ్డల్ని ఎక్కువగా ప్రేమిస్తుందన్న సంగతి నీకు తెలీదా? ప్రయత్నించాలి కన్నీటిని, కనుకొనల్నుంచి బైటికి రాకుండా చేసేందుకు. మరిచిపోవాలి– అంతాను–"

"కొన్ని గంటలక్రితమే జరిగిన యీ విషాదాంత నాటికను ఎల్లా మరిచిపోను హరీ! ఇది మానవమాత్రుడికి సాధ్యమా బాబూ? శరీరపటుత్వం నానాటికి క్షీణిస్తూన్నా– వాడి కోసం ఎంత చేశాను? శక్తి లేకపోయినా రెండు ట్యూషన్లు పెట్టుకున్నాను– వాడ్ని కోసమే హరీ! అది దాని కడియాల్ని చెడగొట్టించి– మరికొంత డబ్బేసి – ఆ కంచాన్ని చేయించింది! ఈ బీదరిక భారంలోనే వాడికి 'తీరని కోరిక' లంటూ లేకుండా చేశాము! అప్పుడెంత గారాబంగా పెంచామో– ఇప్పుడంత దుఃఖంచాల్సొచ్చింది! యాభై ఏళ్ళుగా నన్ను రక్షించిన దేవుడు..... యీ నాటికికూడా నన్ను భక్షించలేదు కాని– పదేళ్ళపాటే వాణ్ని రక్షించి, తన బాధ్యతంతా తీరినట్టు– యజ్ఞపశువులాగు వెంటపెట్టుకువెళ్ళాడు! వాణ్ని గూర్చి నేనెన్ని కలల్ని కన్నాను– హరీ! ఊహాప్రపంచంలో వాణ్ని ఎంత గొప్పవాడుగా చూచుకున్నాను! పెద్దవాడై యీ ముసలివాళ్ళకు సంపాయించి పెడతాడనుకున్నాను. మాకు ఇంకా ముందు మంచిరోజులున్నాయని ఆశపడ్డాను. ఆ ఆశలతోనే లేనిశక్తినీ, నూతనోత్సాహాన్నీ కల్పించుకొని– ముందు వాడి వల్ల రాణిద్దామనుకొన్నాను! కాని నా కలలన్నీ కూలిపొయ్యాయి, ఈ జీవితాంధకారంలో

దూరాన మిణుకు మిణుకుమనే ఆ సన్నని దీపపు కాంతి కూడా అంధకారంలో కలిసి, కరిగిపోయింది! చక్రిలాటి పుత్రుడు తమకు లేడని ఎంతమంది ఈర్ష్యపడేవాళ్ళు! నాకు గర్వభంగం చేసి, ఇంటినొక శ్మశానవాటికగా మార్చి వాడి దారిని వాడు పొయ్యాడు– ఒకచేత్తో ఇస్తూనే ఆ దేవుడు వాణ్ని మరోచేత్తో ఖండించాడు! మమ్మల్ని చిత్రవధ చేసి, క్షీణింపజేస్తున్నాడు హరీ! మా చావును చూడవలసినవాడు– వాడి చావునే మేము యీ కళ్ళతో చూడవలసి వొచ్చింది! వాడి పుట్టినరోజు పండుగను ఎంత గొప్పగా చేశాను! అది నా శక్తికి మించిందైనా నాకు కష్టమనిపించలేదు. బాబూ! హరీ – ఈ లోకంలో వియోగాన్నైనా భరించవచ్చు కాని– ఈ శాశ్వత వియోగాన్ని భరించలేము బాబూ!"

హరి అన్నాడు: "కక్కా! చూడు, నేనే చక్రినీ, నేనే హరినీ అనుకో– వాడు నీకు ఏ ఆనందాన్నైతే ఇచ్చేవాడో – నేను దాన్నివ్వగలను! ఈ లోకంలో మంచివాళ్ళకు తావులేదు. అందుకే వాడి రుణంతీర్చుకొని వాడు జారుకున్నాడు. ఇంకా పన్నెండేళ్ళు గడిచాక... చక్రి.. ఇల్లా తయారైనాడనుకో.. కక్కా! ఉద్యోగంకూడా మానెయ్. నా దగ్గరుండు; మీ రెండుపొట్టల్నీ పోషించే శక్తి నాకు వుంది; నేను బతికున్నన్నాళ్లూ.. చక్రి లేని కొరత తీరుస్తాను..."

రామదాసు ఒక విధమైన పిచ్చి సంతోషంతోనే "నాయనా! హరీ.. కాదు.. చక్రీ! దేవుడిక్కూడా మా మీద జాలి లేదు. ఇన్నాళ్ళూ యీ దేశంలో లేకపోయినా నీ కెందుకయ్యా... ఈ ముసలివాళ్ళ మీద ఇంత దయ?" అంటూ హరిని కావలించుకున్నాడు.

4

"నాకు సెలవిప్పించమని ప్రార్థిస్తున్నాను...""

ఉరిమి చూసి ఇన్స్‌పెక్టర్ అన్నాడు: "శెలవు... శెలవు.. ఇప్పుడు వీల్లేదు సార్. అనుకున్నాను మీ స్కూలు బాగా సాగుతోందని. తీరా యీనాడు చూస్తే మీ స్కూల్లో వున్న విద్యార్థులంత మొండిబండలు నాకు మరే స్కూల్లోనూ కన్పించరు..."

రామదాసు కంట తడిపెట్టి లోపల అనుకున్నాడు: "భగవంతుడా! ఇంకా నన్నీ విషమ పరీక్షల్తో వదలవా? కొడుకుల్ని తీసుకుపొయ్యావ్.. భార్యను లాక్కున్నావ్! నాది అనుకున్న ప్రతి వొస్తువునూ పొట్టను పెట్టుకున్నా.. నిండదా నీ అగాధమైన ఉదరగోళం? ఎందుకు నన్నీ కారణంలేని శిక్షలతో ఇంకా చావబాదుతావ్?"

అమిత కోపంతో ఇన్స్‌పెక్టర్‌ను గూర్చి–

"నీకు పిల్లలు లేరా, భార్య లేదా? వాళ్ళు మృతిపొందితే నీకు మనశ్శాంతి వుంటుందా? వాళ్ళ శాశ్వత వియోగాన్ని నీ హృదయం భరించగలదా? అప్పుడు

నువ్వు శెలవు కోరితే.. నీపై అధికారులు నిరాకరిస్తే నీ హృదయవేదన ఎల్లా వుంటుంది? మానవుడు.. తోటి మానవుడికి సానుభూతి చూపలేడా" అనుకున్న మాటలు పెదవులదాకా వొచ్చి, ఇన్స్‌పెక్టర్ తీక్షణ వీక్షణాలకు భయపడి చేతకాని బీదకోపమంతా అతి ఓర్పుతో గర్భగోళంలోని యథాస్థానానికి వెళ్ళిపోయింది.

కొంచెం ఆలోచించి, ఒక నిశ్చయానికివచ్చి "నాకీ ఉద్యోగం వొద్దు... ఇప్పుడే రాజీనామా ఇస్తాను" అన్నాడు.

"స్కూలును పాడుచేశావ్.. ఇంక నీ ఇష్టం.." పెదిమలు బిగించి తీక్షణంగా చూశాడు ఇన్స్‌పెక్టరు సాబ్. ఆ చూపులకే అగ్నికున్న శక్తి వుంటే.. రామదాసు బుగ్గయ్యేవాడు!

"పాతికేళ్ళనుంచీ నాలోని ప్రతి రక్తకణాన్నీ యీ స్కూలుకు ధారపోశాను. ఇంతవరకూ ఎవరి చేతా మాటపడలేదు. భార్య పోయిననాడుకూడా స్కూలుకొచ్చి పనిచేశాను.."

"ఎవరి కోసం చేశావు? నీ పొట్టకోసం దేవుళ్ళాడావ్..."

"పోనిండి. బతికి చెడ్డవాణ్ని. నన్ను ఇంతటితో పోనీండి. ఇన్స్‌పెక్టరుగారూ! భగవంతుడికే నా మీద దయలేనప్పుడు ఇతర మానవుల సానుభూతి ఉంటుందని నే నెప్పుడూ అనుకోను. ఈ నాటికి మీలాటి దయామయులచేత మాటపడ్డాను! నా తప్పులేమన్నావుంటే– అధికార్లు – క్షమించండి– ఇదుగో రాజీనామా" అని స్తబ్ధుడై కూర్చున్న ఇన్స్‌పెక్టర్ ముందుకు రాజీనామా పత్రాన్ని తోసి ఆ స్కూలును తుదిసారి చూస్తూ, ఒక నమస్కారాన్ని అధికారికి సమర్పించుకొని, 'శెలవు–' అని బైటపడ్డాడు.

బైట తిరుగులాడుతూన్న తన అసిస్టెంటు రామ్మూర్తిని ఇవతలికి పిలిచి రామదాసు అన్నాడు–

"మూర్తీ! నాకు తెలుసు.....నీకు చాలా కాలంనుంచీ యీ హెడ్ మాస్టర్ పదవిని అనుభవించాలనే ఉద్దేశం వుందని. దానికోసం ఆ ఇన్స్‌పెక్టర్‌కు వందరూపాయిలెందుకు తగలేశావ్.. బాబూ? నన్నడుగుతే... నేనీ ఉద్యోగం విడిచిపోనా? నా కెందుకీ సంపాదన? పిల్లలు గలవాడివి అనుభవిస్తావంటే.. నాకు అక్కర్లేనిదాన్ని త్యాగం చెయ్యలేననుకున్నావా? పోనీలే.. అయిందేదో అయింది; కాని ఒక్కటి గమనించు బాబూ... నా ఉద్యోగంలోకి నువ్వొచ్చినట్టే... నీ ఉద్యోగంలోకి మరోవాడొస్తాడనుకో... అప్పుడుకాని తెలీదు నీ బాధ్యత! ఎల్లాగైనా పదికాలాలపాటు పనిచేసి యీ స్కూలును వృద్ధిచెయ్ బాబూ... వెళ్ళివొస్తా..." రామ్మూర్తి శిలా ప్రతిమలా నిలబడి, మాట్లాడేందుకు నోరువిప్పి... మాట్లాడలేక గుటకలు మింగుతూ మెల్లి మెల్లిగా వెళ్ళిపోతూన్న యీ అవతారమూర్తిని చూస్తూ నిలబడిపొయ్యాడు.

5

"హరి! ఉద్యోగం కాస్తా ఊడింది."

హరి అదిరిపడి "అదేం?" అన్నాడు. జరిగిందంతా రామదాసు నోటివెంట విన్నాక హరి "ఇంత అన్యాయమూ... అక్రమమూ జరుగుతూంటే... నేను ఊరుకోలేను కక్కా... రేపేవెళ్ళి బోర్డ్ ప్రెసిడెంటుతో మాట్లాడివొస్తా..." అన్నాడు.

"అక్కర్లేదు హరీ! అది నా చేతులారా చేసుకుందేలే! పెళ్లామా, బిడ్డలా! నా కెందుకీ ఉద్యోగం? ఒకళ్ళు క్షీణిస్తేనే కాని, మరొకరు రాణించరు. పోని ఆ రామ్మూర్తినే తిననీలే! జీవితంలో అన్ని బాధ్యతలూ తీరిపోయినయ్. ఒక్కణ్నీ ఏకాకిగా నిలబడిపొయ్యాను హరీ! మృత్యుదేవత మా కుటుంబంమీద చూపే యీ అపార దయను భరించలేను బాబూ! ఒక సామాన్య మానవహృదయంలో ఇమడనంత విషాదాన్ని నాపై మోపాడు. అదికూడా బతికివున్నట్టయితే ఒకరికొకరం ఎదురుగా కూర్చొని ఏడ్చేవాళ్ళం. అదీ ఒకందుకు మంచిదే అయిందిలే! యాభై ఏళ్ళ జీవితం గడిచిపోయింది; ఇందులో నేను సాధించిందేమీ లేదు. అంతా స్వప్నంలాగు సాగిపోతోంది; నేను సంతోషపెట్టాల్సిన వ్యక్తి లేనేలేడు! నాకు నేనై ఒంటరిగా యీ సముద్ర మధ్యంలో నిలబడిపొయ్యా... ఆ మృత్యుదేవతకు నేను తప్ప... మిగతా కుటుంబీకులందరూ కన్పించారు కాబోలు! నా జీవితానికి 'శాంతి' వుంటే దాన్ని ఒక్క మృత్యుముఖంలోనే అనుభవించగలనేమో! ఇంకెందుకీ ఇన్సూరెన్స్ పాలసీ..." అని దాన్ని చింపి కాలితో నేలనేసి రాశాడు.

సందె చీకట్లు క్రమ్ముకుంటున్నాయి. హరి, రామదాసు పాదాలదగ్గర కూర్చొని ఏమో దీర్ఘంగా ఆలోచించి అన్నాడు.. "కక్కా! నేను చెప్పలేదా... ఇంట్లో కూర్చొని తినమని! నీ శక్తికిమించిన వన్ని నువ్వెందుకు చేస్తావ్?"

నవ్వి రామదాసు, "నీ కెందుకయ్యా... ఇంత దయ, దేవుడే నా జీవితాన్ని నిర్దయగా, నిర్లక్ష్యంగా నలిపి పారేశాడు! ఈ లోక భారానికీ, దుఃఖానికీ కృంగి కృశించిపోయి... ఎవ్వరికీ ఎందుకూ కొరగాని యీ బీదవాడికోసం.. ఎందుకయ్యా... అతి విలువైన సానుభూతి కన్నీటిని వృథా చేసుకుంటావ్?" అన్నాడు.

హరి కక్కా పాదాల్ని తాకుతూ, 'కక్కా! నేనేం చెప్పాను? నేనే చక్రిని కానూ? అప్పుడే మరిచిపొయ్యేవా... నన్ను?" అన్నాడు.

రామదాసు లోలోపల హరిని దీవిస్తూ అన్నాడు: "సరేనాయనా! కాదన్నానా? చూడు బాబూ! ముసలివాణ్నయిపొయ్యాను. శరీరంలోని కండలు ఒక్కొక్కటిగా కరిగిపోతున్నై. రోజు రోజుకూ క్షీణించే శక్తితో చర్మం ముడతలు పడిపోతుంది. చూపుకూడా సరిగ్గా ఆనటం లేదు... నాకు ఇంక జీవితంలో ఒక్కటే కోరిక వుంది;

రామేశ్వరమూ, కాశీ చూద్దామని వుంది. ఆ కాశీలో విశ్వనాథుడి ముందు పవిత్ర గంగాజలపానంలో శాంతి దొరుకుతుందేమో! నేను పూర్వజన్మలో ఏ సత్కార్యాన్నైనా చేసివుంటే.. ఆ శంకరుడికి నా మీద ఏ కొద్ది దయైనావుంటే... ఆ త్రిశూలంతో నన్ను పొడిచి పడరానిపాట్లనుంచీ, భరించలేని బాధలనుంచీ విముక్తి చెయ్యమని ప్రార్థిస్తా. కాశీలో అందరూ తమకు అత్యంత ప్రియమైనవాటిని వొదిలి పెడతారు. నేను నా ప్రాణాన్ని వదిలివేస్తా.. బాబూ!"

హరి దిగులుతో, "కక్కా! వెళ్ళిపోతావా? నన్ను విడిచి వెళ్ళిపోతావా?" అన్నాడు."ఇంక నేను ఎక్కువ దినాలు బతకనని నాకెవరో చెప్తున్నారు బాబూ! బద్ధలైన నా తపమంతా యీ జన్మతో తీరిపోతే అదేచాలు హరీ! విషాదపూరిత మానవ జన్మకన్న... శాంతియుత జంతుజన్మే మంచిది... నీ కెందుకయ్యా... యింత దుఃఖం... నా బాబూ!"

"తండ్రి పోతూంటే కొడుక్కు సంతోషమా... కక్కా..."

"బాబూ...అనుకున్నాను- నేను చస్తే కంటతడిపెట్టే ప్రాణన్నా లేదని. ఇప్పటికి యీ విశాల విశ్వంలో నువ్వొక్కడివి మాత్రమే కన్పించావు. చాలు బాబూ... నీలాటి వ్యక్తిని చూసి సగం మనోబాధను చంపుకోవచ్చు; మన మనుకొన్నవి ఎన్ని పోవటంలేదు... హరీ! ఎంతమంది యీ లోకంలో దిక్కులేని చావు చావటంలేదు? అందులో నేనొక్కణ్ని. నామీద నీకు దయవుంటే నన్ను పోనీ హరీ! ఈ ఒక్క 'ఆశ'నూ కూడా 'నిరాశ' చేసుకోనీ, నువ్వు కాదనకు హరీ!"

"పొయ్యేవాడివి... నన్నుకూడా తీసుకుపో కక్కా!"

"నువ్వా? పదికాలాలపాటు వర్ధిల్లి సౌఖ్యాన్ని అనుభవించు తండ్రి! నోచుకోని వాళ్ళకు దుఃఖమే అయినా... నోచుకున్న వాళ్ళకు యీ లోకంలో సౌఖ్యం లేకపోలేదు బాబూ... ఒద్దు హరీ! నువ్వెందుకు" "అని మెల్లిగా హరి తలను నిమరసాగాడు. ఇప్పటికి చెప్పలేని బాధతో వెలువడ్డ కన్నీటి కాల్వ.. రామదాసు పాదాల్ని కడిగేసింది.

"నాకు ఒక్క పని చేసిపెట్టు బాబూ.... డబ్బు లేకపోతే... మన మొక భూభారమైపోతాం. ఆ యిల్లు అమ్మి ఆ వొచ్చిన డబ్బులో నాకు నెలకు ముప్పైరూపాయిలచొప్పున పంపుతూండు, నేను చనిపొయ్యాక ఇంకేమైనా మిగిలివుంటే నువ్వు తీసుకోబాబూ! ఆ ఆవూ, దూడా - యింకా నాలాగే బతికివున్నై. వాటిని కన్నబిడ్డల్లాగు పెంచాము బాబూ. వాటిని నిమిరే కమనీయ హస్తాలన్నీ ఒక్కొక్కటిగా మాయమౌతున్నా రేపట్నుంచీ నీ చేతులకు వాటిని పోషించే బాధ్యతను యియ్యి. వాటిని ఎవ్వరికీ యివ్వొద్దు. అమ్మొద్దు. ఒకవేళ అవి చస్తే- వాటిని మాలాళ్ళకు యివ్వొద్దు బాబూ! పుత్రుల్లాగే వాటిని కూడా భూమాతకు పెంచుకునేందుకివ్వు. వాటి శవాల్ని పురుగులపాలూ, నక్కలపాలూ కాకుండా- భూస్థాపన చేయించు. ఆ గోమాత

నన్నూ, పిన్నినీ, చక్రినీ కూడా పోషించింది. ఆ ఆవు- మొదటిసారి దాని కొడుకు పోయినప్పుడు మాలాళ్ళు దాన్ని కాళ్ళు కట్టుకులాక్కుపోతూంటే- కంటనీరు పెట్టి కొమ్ముల్ని విసిరింది. రెండు రోజులదాకా నీరు తాగలేదు. గడ్డి కొరకలేదు. చక్రి పోయినప్పుడు కూడా- అల్లానే సానుభూతి చూపింది. చక్రి పుట్టకపూర్వం దూడగా వున్నప్పుడు తెచ్చుకున్న ఆవది. కొడుకు లాగే సాకాము. ఈ చేతుల్లోనే పెరిగి పెద్దదైంది. దాని ఇష్టంవొచ్చినట్టు తిరగనిచ్చాము. ఏ పొలంలోకి దూకక, ఎవరి పైర్లనూ నాశనం చెయ్యక, చెట్లచాటున వాలుతూ, గట్లమీది గడ్డిని మేసి- సూర్యాస్తమయ సమయానికి యిల్లు చేరేది. ఎవర్నీ ఎప్పుడూ పొడిచి ఎరగదు. ఆలస్యమైతే చక్రి పాలకు ఏడుస్తాడని- ముందుగానే వొచ్చేది. మమ్మల్ని కడుపులో పెట్టుకు కాపాడిన దానికి మాత్రం- యీ మాత్రం విశ్వాసంచూపటం నా విధి- యిది మరిచిపోవొద్దు బాబూ!

హరి వలవలా ఏడుస్తూ, “కక్కా! కక్కా! నీకీ మాటలు దయగలవేమో కాని - నా హృదయాన్ని చీలుస్తున్నై. నీకు డబ్బు కావలిస్తే నేను పంపనా కక్కా! ఒక్క కడుపునేగా నాన్నా నువ్వూ పుట్టింది- ఈ మాత్రపు సహాయం నేను చెయ్యలేననుకున్నావా కక్కా! నా దగ్గర నాకు అనవరమైనంతగా డబ్బు మూలుగుతోంది. నీకు నెలకు యాభై రూపాయలు పంపుతా కక్కా. నా మాట విను” అన్నాడు.

రామదాసు తలతిప్పి, కళ్ళు మూసుకునే హరి తలను స్పృశిస్తూ. “సరే బాబూ- నీ యిష్టంవొచ్చినట్టే కానీ-” అన్నాడు.

మర్నాడు పాడుబడ్డ తన యింటిని చూసుకుంటూ రామదాసు అన్నాడు: “రెండు మాసాల క్రితం యిందులో ఒక కుటుంబం వుండేది; యిప్పుడిది సూర్యచంద్రులు నివశించేందుకు తప్ప యింకెందుకూ పనికిరాని శ్మశాన వాటికలాగు తయారైంది.”

హరిని దొడ్లోకి తీసుకుపోయి అన్నాడు: “పోషించేవాడు లేక చెట్లజీవితాలు కూడా వృథా అయిపోతున్నాయి. తమను చూచేవారే లేరని తలలు వాల్చేశాయి. యింకెవరికి కావాలి వాటి పూలు? నాలాగే వాటి జీవితాలు కూడా ఎవరికీ కొరగాకుండా నశిస్తున్నాయి. రాతిబండమీద కూర్చుని చక్రి వేడినీళ్ళ స్నానంచేస్తే- అవ్వి తాగి పెరిగింది- యీ కాకరగుబురు- యింకెవరు పోస్తారు దానికి నీరు?”

ఆవును చూపుతూ, “హరీ! యిదివరకే చెప్పాను దీన్ని గూర్చి- నేలేని కొరత తీర్చుబాబూ!” అన్నాడు.

రామదాసు మాటలు వాటికి అర్థమైనట్టు తలలు ఆడించి నేలను తంతూ “అంబా” అని అరిచాయ్. వాటిని నిమురుతూ అన్నాడు: ‘ఫరవాలేదు- మీకు ఏకష్టమూ లేకుండా హరి మిమ్మల్ని చూస్తాడులే! మీలాగే నేను కూడా ఏకాకినై వున్నానుగా! మిమ్మల్ని

పెంచి, నిమిరే కమనీయ హస్తాలు ఒక్కొక్కటిగా మాయమౌతున్నాయనా యీ విచారం? ఈ కుటుంబానికి తుదివ్యక్తి కూడా వెళ్ళిపోతున్నాడనా? మానవజీవితమే యింత కష్టభూయిష్ఠమైతే- యింక జంతుజీవితాల్ని గూర్చి ఏం చెప్పను! మళ్ళీ మిమ్ము చూడలేనమ్మా- యివ్వే కడసారి చూపులు." గోవుకు ప్రదక్షిణం చేసి మెల్లిగా యివతలికి వొచ్చాడు. వెనకనే నిలబడిపోయిన జంతువులు మాటలురాక- తమ హృదయభారాన్ని గొంతెత్తి పెద్దగా అరిచి చూపాయి.

కొంతమంది గ్రామస్థులూ, విద్యార్థులూకూడా మాస్టార్ని చూసేందుకు వొచ్చారు. అందరికీ నమస్కరిస్తూ రామదాసు అన్నాడు: "మీ చలవ వలన యిన్నాళ్ళూ యిక్కడ వున్నాను. మళ్ళీ మిమ్మల్నందర్నీ చూడగలనో- లేనో? ఈ గ్రామమంతా సుఖంగా వుండటమే నాకు కావాల్సింది...... నేను వెళ్ళిపోతున్నానని మీరు దిగులుపడొద్దు, యిప్పుడున్న మాస్టర్లు కూడా మంచివాళ్ళు. జాగ్రత్తగా చదువుకొని, వృద్ధిలోకి రాండి-"

ఒక్కొక్కరే బరువైన హృదయాల్తో వెనక్కు మళ్ళారు.

వెంట వొస్తూన్న హరితో, "హరీ! చక్రి బట్టలూ- దాని బట్టలూ బీదవాళ్ళకు యిచ్చెయ్" అన్నాడు. హరి మౌనంతో తలవూగించాడు.

కొంతదూరందాకా ఎవ్వరూ మాట్లాడలేదు, కాని వాళ్ల హృదయాల్లో ఏదో ఆందోళన లేకపోలేదు.

"యాభై ఏళ్ళుగా పీల్చిన యీగాలిని వదిలి వెళ్ళటం నాకూ కష్టంగానే వుంది- హరీ! యింకెంతదూరం వొస్తావ్? యింటికివెళ్ళు బాబూ! ఈ చీకట్లో మళ్ళీ యిదంతా వెనక్కు నడవొద్దా? కడసారి నిన్ను కావలించుకోనీ హరీ!" అని హరిని కావిలించుకున్నాడు.

హరి కక్కపాదాల్ని పట్టుకొని "కక్కా! నిన్నక్కడెవరు చూస్తారు? యిప్పటికైనా మించిపోయిందేమీ లేదు- పద యింటికి వెళ్దాం-" అన్నాడు.

రామదాసు మెల్లిగా నవ్వి, లోలోపల హరిని దీవిస్తూ, "అందర్నీ చూసే భగవంతుడే చూస్తాడు బాబూ! యింక నువ్వు ఆగు-" అని బండివాడితో, "తోలరా- బండి" అన్నాడు.

గణగణమనే చప్పుడుతో బండిసాగి చీకటిసముద్రంలో లీనమైపోయింది. స్తబ్ధుడై క్షణక్షణానికీ క్షీణిస్తూన్న గంటలచప్పుడు వింటూ హరి వెనుక నిలబడిపోయి- కొన్ని నిమిషాలకు తెప్పరిల్లి గొంతంతా చించుకుంటూ, "కక్కా-కక్కా-కక్కా !" అన్నాడు- శూన్యంలోకి చూస్తూ. ఒక్క ప్రకృతిమాత మాత్రమే హరికి సమాధానమిచ్చింది.

6

నిజానికది చాలా అపూర్వ విచిత్ర సంఘటనే ! విధివిలాసం అనండి మరేమన్నా అనండి- కానీ అది రామదాసు జీవితంలో చెప్పలేని మార్పును మాత్రం తెచ్చింది.

ఆ మెద్రాస్ అరవ గొడవలో తలవని తలంపుగా రామదాసు తెలుగుభాషలో పలకరించిన వ్యక్తి ఆనాడు బట్టల షాపులో ఎదురయ్యాడు.

"మీదేవూరండీ?"

రామదాసు చెప్పాడు.

ఆ వ్యక్తి నమస్కరించి, "మాస్టారూ !నన్ను మరిచిపొయ్యారా?" అన్నాడు.

ఎవరు? రామదాసు గడిచిన జీవితాన్ని వెనక్కుతిరిగి చూసుకున్నాడు. తనదగ్గర చదువుకున్న అనేక ముఖాలు కన్పించాయి కాని- ఆ పాత పురాణంలో యీ వ్యక్తి మాత్రం తెలీటంలేదు.

తనకు తానై అతనన్నాడు, "నేను- వీరెంకయ్యగారబ్బాయిని- కృష్ణస్వామిని-"

రామదాసుకు బాగా గుర్తొచ్చి, "నువ్వా స్వామీ? యిన్నాళ్ళయినా నన్ను మరిచిపోలేదా?" అన్నాడు అదోవిధమైన సంతోషంతో నవ్వుతూ.

ఏవేవో కుటుంబ విషయాల్ని గూర్చి మాట్లాడుకున్నారు కాని, రామదాసు మాత్రం తన విషాద జీవితాన్ని స్వామికి చెప్పక..... తను రామేశ్వర ప్రయాణానికి వెళ్తున్నట్టు మాత్రం చెప్పాడు. కృష్ణస్వామి మెద్రాస్‌లో యినుప కార్ఖానా పెట్టుకొని డబ్బు ఆర్జిస్తూన్నట్టు రామదాసు తెలుసుకున్నాడు.

"మా యింటికి వెళ్దాం రాండి"- అని కృష్ణస్వామి రామదాసును బలవంతాన తన యింటికి తీసుకువెళ్ళాడు.

ఎనిమిదేళ్ళ కుర్రవాడొకడు యింటి గుమ్మంలో ఎదురై, "నాన్నా ! నాకు పెన్ను తెచ్చావా?" అన్నాడు.

కృష్ణస్వామి, "రేపు" అన్నాడు.

కుర్రవాడు బిక్కమొగంతో దిక్కులు చూడసాగాడు.

కుర్రవాడు రామదాసు దృష్టినంతట్నీ ఒక్కసారి తనవైపు లాక్కున్నాడు. సరిగ్గా తన చక్రి పోలికే వాడిది. పోయిన చక్రి యిక్కడ జన్మించాడా? యిదెట్లా సాధ్యం? ఈ విశాల విశ్వంలో మనిషినిపోలిన మనుషులు ఎంత మందిలేరు.? పోయిన విలువైన వస్తువు ఉన్నట్టుండి దొరికితే పొందేలాటి సంతోషంతో రామదాసు హృదయం నిండింది.

వెంటనే తన జేబులోవున్న కలాన్ని తీసియిస్తూ 'యిందు' అన్నాడు. కుర్రవాడు- ఆ కలం ముసలిదనికూడా తెలుసుకోలేక- సంతోషంతో ఎగిరాడు.

కృష్ణస్వామి. "తప్పు- అది వారిది- రేపు మనం తెచ్చుకుందాంగా- యిచ్చెయ్-" అన్నాడు.

వాడు మాట్లాడకుండా ముఖం ముడిచి, కలంవున్న తన బుల్లి చేతిని రామదాసు వైపు చాపాడు.

రామదాసు నవ్వుతూ, "నాకింక దాంతో పనిలేదులే బాబూ- నువ్వుంచుకో-" అన్నాడు.

"పోనీ రేపు కలం రాగానే ఆయనది ఆయన కిచ్చేస్తావా?"

కుర్రవాడు 'సరే' నన్నట్లు తలవూపాడు.

పెదవి విరుస్తూ కృష్ణస్వామి, "చదువులేదు కాని, కలాలు కావాలి" అన్నాడు. వాడిదేమీ విన్పించుకోకుండా "నాన్నా! ఈయనెవరు?" అన్నాడు.

కృష్ణస్వామికి ఏం చెప్పేందుకూ తోచక- బుర్ర గోక్కుని, "తాతయ్య" అన్నాడు. బహుశా రామదాసు ముసలిముఖాన్ని చూసి కృష్ణస్వామి యీ వరస బాగుందని తలిచాడేమో !

"తాతయ్య- ముసలితాతయ్య" అంటూ నవ్వి, రామదాసు చెయ్యిపట్టుకొని- "తాతయ్యా- నా పుస్తకాలు చూస్తావ్?" అన్నాడు.

ఈ తాతా- మనుమల స్నేహం మాత్రం కృష్ణస్వామికి అర్థమవలేదు.

రామదాసు వాణ్ని దగ్గరకు లాక్కుంటూ "నీ పేరేమిటి?" అన్నాడు.

"చ-క్రి"

చక్రి ! భగవంతుడు బలిగా తీసుకొన్నాడనుకొన్న చక్రి! మృత్యుముఖంలో పడి పొయ్యాడనుకొన్న చక్రి ! మళ్ళీ రెండు నెల్లకే దొరికాడు ! తను ఎవరికోసం తపించి అంతులేని ఆందోళనకు గురవుతున్నాడో- వాడే యిక్కడ ప్రత్యక్ష మయ్యాడు.

"చక్రీ- చక్రీ ! నా కోసం యిక్కడున్నావా?" అని ఉద్రేకంతో లోలోపల అనుకొని వాణ్ని దగ్గరకు లాక్కున్నాడు. ఆ రాత్రి భోజనాలయ్యాక కృష్ణస్వామి అన్నాడు: "ఎంతమంది మాస్టర్లను పెట్టినా చక్రి చదవటం లేదు ! మీరిక్కడుండి కొన్నాళ్ళపాటు వాడికి చదువు చెప్పరాదా?"

రామదాసుకు తెలుసు - తను యీ చక్రిని విడిచి వెళ్ళలేనని. తన జీవితాంధకారంలో యిప్పుడొక మెరుపు మెరిసినట్టుంది. తను చక్రితో గడిపిన పదేళ్ళూ జ్ఞాపకానికొచ్చాయ్. ఈ 'చక్రి' తన చక్రికన్న రెండేళ్ళు చిన్నయినా తన ప్రాణమంతా

వాడిమీదికే పోసాగింది. శాంతి యెరుగని అతని మనస్సుకు, ఈ కుటీరంలో శాంతి వుండొచ్చని రామదాసు నమ్మాడు. తన పుత్రశోకాన్ని కొంత మరిచిపోవొచ్చు ! అందులో కృష్ణస్వామి తనకు తానై అడిగాడు. రామదాసు అప్రయత్నంగానే "సరేలే" అని తలవూగించాడు.

❋ ❋ ❋

ఉదయాన ఒక గంటా, సాయంత్రం ఒక గంటా- చక్రికి చదువు చెప్పటం తప్ప- మిగతా ఇరవైరెండు గంటలూ- రామదాసుకు తీరికే! ఏ మాస్టరు దగ్గరా శ్రద్ధగా చదువుకోని చక్రి రామదాసు దగ్గర మాత్రం వినయంగా కూర్చొని చదువుకోసాగాడు. చక్రిని ఆజ్ఞాపించే ఏ శక్తి రామదాసు కళ్ళల్లో వుంది !

ఈ శుశ్రూష ప్రారంభమయ్యాక- చక్రి స్కూలు ముఖమే చూడటం మానేశాడు. కృష్ణస్వామి- కొడుకు గడుసుతనాన్ని మాని ఎల్లాగో చదువులో పడ్డాడనే అభిప్రాయంతో వాణ్ని యేమీ అనేవాడు కాదు.

చదువు కాంగానే గురుశిష్యులిద్దరూ పెరట్లో పూలమొక్కల మధ్యవున్న నాపరాతి అరుగుమీదికి జేరేవారు. ఎవరూ చూడకుండా- రామదాసు చక్రిని ఎత్తుకునేవాడు. ముద్దు పెట్టుకునేవాడు, బజార్నుంచి వాడికి మిఠాయి తెచ్చిపెట్టేవాడు.

"తాతయ్యా ! నీకు కథలు వొచ్చా?"

బోసి నోటితో నవ్వి రామదాసు తలవూపాడు.

"నాకో కథ చెప్పు-"

రామదాసు చక్రికి అర్థమయ్యేకథ వెదికి, "అనగా.... అనగా...ఒక వూళ్ళో ఒక రాజు...." అని మొదలుపెట్టాడు.

చక్రి ముఖంముడిచి, "ఛీ.... యీ కథను లక్షసార్లు విన్నా.... నే చెప్పనా? ఆ రాజుకు ఏడుగురు కొడుకులు! ఏడుగురూ ఏట్లోపడి- ఛీ- యికవొద్దు- వెధవరాజుల కథలొద్దు. మంచి కథ చెప్పు" అన్నాడు.

రామదాసు తన కథనూ, తనలాటి దౌర్భాగ్యుల కథల్నీ చెప్పేవాడు. చక్రి మహా మంచి పిల్లవాడిలాగా అల్లరి చెయ్యకుండా వినేవాడు. ఆ కథల్ని చెప్పేందుకు తాతయ్యకూ, వినేందుకూ చక్రికీకూడా విసుగుండేది కాదు. తన యీడు స్నేహితులకన్నా యీ ముసలి స్నేహితుడు చక్రికి బాగా నచ్చాడు.

ఈ కథా కాలక్షేపంతో భోజనానికి పిలుపొచ్చేదాకా గురు శిష్యులిద్దరూ తోటలోనే పీఠంవేసేవారు. అదేం చిత్రమో కాని తాతా మనుమల స్నేహం దినదినాభివృద్ధినొంద జొచ్చింది. మనమడు తాతకొంగు పట్టుకు వేళ్ళాడేవాడు. వాడికి తాత గదిలో తప్ప నిద్రపట్టేది కాదు.

నెల తిరగంగానే కృష్ణస్వామి బలవంతాన పదిహేను రూపాయిల్ని మాస్టారికి జీతం కింద యిచ్చాడు.

ఆనాడు సాయంత్రం చక్రిని వెంటబెట్టుకొని బజారుకు వెళ్ళి - అనేక ఆటవస్తువుల్ని కొని- ఒక బండెడు సామానుతో యిల్లు జేరాడు. వాడు బూరాలు వూదుతూ యిల్లంతా నాట్యంచెయ్య మొదలెట్టాడు. తాతయ్య చేతకూడా ఆ హార్మోనీనీ, బూరాల్నీ వూదించేదాకా వాడికి తృప్తే లేదు. యిల్లంతా దద్దరిల్లే శబ్దంతో యిద్దరూ వాయిద్యాల్ని అమోఘంగా వాయించేశారు. పేకముక్కల్తో యిద్దరుపనివాళ్ళూ మేడకట్టి గృహప్రవేశ మహోత్సవం దిగ్విజయంగా చేశారు.

చక్రి చాలా రాత్రి వరకూ ఆట వస్తువుల్లోని జంతుజాలంతో సర్కస్ నడిపి - అలసి, సొలసి తాతయ్య కథను సగంవిని అల్లాగేపడి నిద్రపొయ్యాడు. చక్రి 'ఊ' కొట్టకపోవటం చూసి- ఆ విశాల విశ్వంలో ఎవ్వరికీ పనికిరాని తనతో యిన్ని ఆటలూ ఆడి నిద్రాదేవి కౌగిట్లో ఒరిగిన చక్రికి చలిగాలి తగలకుండా దుప్పటికప్పి- రామదాసు తన మంచాన్ని జేరుకున్నాడు. రామదాసు తను అనుకున్నంత నిర్భాగ్యుడు కాదనీ, యిక్కడ శాంతిదేవతతో సంధి కుదిరిందనే అభిప్రాయంలోపడి, వివిధ విషయాల్ని తలుస్తున్నాడు.

ఎంతకూ నిద్రరాకపోవటంవల్ల మెల్లిగా వరండాలోకి వెళ్ళాడు. ఆ పక్కగదిలో కృష్ణస్వామీ అతని భార్యా మాట్లాడుకుంటున్నారు. వారి మాటల్లో 'మాస్టారు' అనే పదం విని తనను గూర్చే వారేదో అనుకుంటున్నారని మెల్లిగా వినసాగాడు.

"మీకు తెలీదు. నేను చెప్తే వినరు. చూడండి! వాణ్ని ఎత్తుకు ఆడిస్తూండగా నేను చూశాను. యివ్వాళ వాణ్ని బజారు తీసుకువెళ్ళి బండెడు సామాన్లు ఎగుమతి చేశారు. ఆ సామానుతో యివ్వాళ యింట్లో భూకంపం పుట్టినట్టు... యిద్దరూ కలిసి పెద్దగా నవ్వుతూ గంతులు వేస్తూ చెవులు చిల్లులు పడేలాగు బూరాల్ని వూది వూది యింతకుముందే పడుకున్నారు. లేని గారాబాన్ని మెడకు చుడుతూంటే... వాడికేం భయం వుంటుంది? యివ్వాళ ఆయన దగ్గర మరిగిన చనువంతా... రేపు మనమీద ప్రయోగిస్తాడు. మాస్టరంటే భయం వుండాలి. అదేం చనువు? నేను చెప్తున్నాను; వాడికి చదువురాకపోగా పాడైపోతున్నాడు కూడాను! తప్పుచేస్తే దబాయించలేనివాడు గురువెలా అవుతాడు?"

"కాదు లక్ష్మీ! ఆయనెల్లా చేస్తేనేమి? ఎవరి దగ్గరా చదవని చక్రి ఆయన దగ్గర కిక్కురుమనకుండా పడివున్నాడు. ఆయనకు బాగా తెలుసు... ఆయన బాధ్యత. నేను ఆయన దగ్గర్నే చదువుకున్నాను... నాకు తెలీదా... ఆయన సామర్థ్యత? ముసలివాడు; పిల్లలు లేనివాడు... పిల్లలంటే జాలి చూపటం సహజమేగా!"

కోపంతో ఆమె అంది: 'మీ యిష్టమైతే నెత్తిన ఎక్కించుకోండి! భోజనానికి తప్ప వాడు కన్పించడు. ఎప్పుడూ పనికిరాని కబుర్లు చెప్తూ వాణ్ని పూర్తిగా లొంగదీసుకున్నాడు. వాడి సామాన్లన్నీ ఆయన గదికే జేర్చుకున్నాడు. యిల్లా కొంతకాలం జరిగితే చక్రి ఎందుకూ పనికిరాని సోమరిగా తయారౌతాడు! కొడుకు విషయంలో తల్లిక్కూడా బాధ్యత వుందనే సంగతి మీకు తెలీదా?"

"నన్నేం చెయ్యమంటావ్?"

"చెప్పండి ఆయనతో... యింక యీ ప్రైవేటు వొద్దని..."

"నాకది చాతకాదు..."

"పోనీ నేను చెప్తా..."

"ఒద్దు... లక్ష్మీ!"

"ఒద్దకపోతే నాకీ సంసారంతోనే పనిలేదు. మీ యిష్టమూ, వాడి యిష్టమూను. ఈ ప్రైవేటు వొచ్చాక వాడు స్కూలుక్కూడా పోవటం మానేశాడు. 'తాతయ్య' 'తాతయ్య' అనుకుంటూ ఆయన స్నానం చేస్తే తను చేస్తూ ఆయన మాంతే తనూమాని... బాగానే వుంది! మొక్కై వొంగంది మానై వొంగుతుందా?"

మరి మాటలు విన్పించలేదు.

రామదాసు నిట్టూర్చి మెల్లిగా వెళ్ళి మంచంమీద వాలి దీర్ఘాలోచనలో పడ్డాడు. తన మూలాన-తనకు తెలీకుండానే చక్రి పాడైపోతున్నాడేమో! తల్లికి తెలీని బాధ్యత... పరాయివాడైన తనకు తెలీదేమో! అనవసరమైన గారాబం చూపితే పిల్లలు పాడైపోరా... మరి? తన కృషి ఫలించకపోయినా... తను యీ దంపతుల మధ్య కలహానికి కారణమౌతున్నాడు! తను యింకా ముందు ముందు యీ కుటుంబానికి హానిచేస్తాడేమో! తను మంచి తలపెట్టినా దాని పరిణామం చెడుగానే మారుతోంది.

అనుకున్నాడు..."భగవంతుడా! నేనేం తప్పు చేశాను... యింతమంది దృష్టికి కంటకంగా వుండేందుకు? ఈ శాంతిమయ కుటీరాన్ని నా జీవిత పథంలో ఎందుకు సృష్టించావు? జాలరి ఎరను చూపి ఆశపెట్టినట్టు... కొంతవరకూ మరిచిపోయిన చక్రిని మళ్ళీ నా కెందుకు చూపావ్? నన్ను వెళ్ళగొట్టించేవాడివి... ఎందుకిక్కడ జేరనిచ్చావ్? నాలాటి నిర్భాగ్యుల్ని యింకెన్నాళ్ళు భరిస్తుంది యీ భూమి? భూమాతా! ఒక్కసారి నీనోరు తెరిచి నన్ను నీలో యిముడ్చుకోతల్లీ! ఒక్కసారి సముద్రాలన్నీ పొంగి నన్నొక్కణ్నీ యిముడ్చుకోరాదా? ఆకాశం ఒక్కసారి విరిగి నా నెత్తినపడి నన్ను పాతాళానికి పంపరాదా?"

ఈ విధంగా తల్చుకుంటూ, తన జీవితంలో రాబొయ్యే విషాద సంఘటనకు కన్నీరు కార్చుకుంటూ.. రామదాసు దాదాపు ఆ రాత్రంతా నిద్రాదేవిని దరిజేరనీయలేదు!

7

ఉదయాన అమ్మగారు పిలుస్తూన్నట్టు విని... ఆమె ఎందుకు పిలిచిందో తెలిసిన రామదాసు నిర్విచారంగా దాసీని అనుసరించాడు. యిప్పటికి చక్రి యింకా లేవనేలేదు;

"మీరు వాణ్ని నెత్తినెక్కించుకుంటే లాభంలేదు. వాణ్ని భయపెట్టాలి. చనువిస్తే పిల్లలెప్పుడూ పైకిరారు..."

"నేను కొట్టనూలేను... భయపెట్టనూలేను... తల్లీ!" యిన్నాళ్ళూ యజమానురాలు కుక్కమీదా, పిల్లిమీదా పెట్టి తనను ఎందుకు తిట్టేదో రామదాసుకు యిప్పుడు అర్థమౌతోంది,

"వాడు స్కూలుకూడా మాని మీతో ఆటల్లో పాటల్లో కలిసిపోతున్నాడు! మీరు చూడండి; రోజులో అనేక గంటలకాలం వాడు సోమరితనంతోనే గడుపుతున్నాడు; మీరందుకు అవకాశం యివ్వొద్దు..."

"నేను అతన్ని యేం అనలేనమ్మా! ఈ రాత్రి బండికే నేను రామేశ్వరం వెళ్ళిపోతున్నాను. మీరింకో మాస్టర్ను కుదుర్చుకోండి. తెలిసో తెలియకో నేనేమైనా హాని చేసివుంటే క్షమించండి."

తన నోటి మీదుగా రావాల్సిన మాట మాస్టారి నోటి వెంటనే వొచ్చినందుకు ఆమె సంతోషించింది. కాని దాన్ని మరుగుపరుస్తూ ఒక విధమైన కోపంలో నేలను తన్ని... లేని కోపాన్ని దాసీదాని మీద చూపింది.

రామదాసు తలొంచుకొని నిట్టూర్చి బైటపడ్డాడు.

చక్రి లేస్తూనే బాకాను వూదుతూ ఆ ఉదయాన తాతయ్యకు వివాహ మహోత్సవాన్ని నిర్విఘ్నంగా చేసేశాడు.

ఈ రాత్రే చక్రిని వీడిపోవాలనే మాట జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా రామదాసు కలవరపడసాగాడు.

తోటలో కూర్చుని మనవడి వాయిద్య ప్రతిభను పరీక్షిస్తున్నాడన్న మాటే కాని... రామదాసు మనస్సు మనసులోనే లేదు. అతి పరాకుగా చక్రి అడిగే కుంటి, గుడ్డి ప్రశ్నలుకూడా... రామరాసు చెవిలో జొరబడటంలా.

"తాతయ్యా! యివ్వాళ అల్లా వున్నావేం? "ఒక్కసారిగా ఉలిక్కిపడి, తన స్థితిని చక్రి గ్రహించాడేమోనని... లేని నవ్వుముఖం పెడుతూ, "ఏం బాగానే వున్నానే!" అన్నాడు.

"నన్ను ఎత్తుకోలేదేం?"

ఓ విధమైన సంతోషంతో ఎత్తుకొని హృదయంలో యిమడక పొంగి పొరలివొచ్చే దుఃఖంతో! అప్రయత్నంగా అన్నాడు- "రేపట్నుంచీ నిన్నెవరెత్తుకుంటారు బాబూ"

చక్రి నవ్వుతూ, "ఏం? నువ్వే" అన్నాడు.

రామదాసు వికటంగా నవ్వి "నేనా? నేను రాత్రికి వెళ్ళిపోతా చక్రీ" అన్నాడు.

"ఎక్కడికి? యింక చాల్లే దింపు..."

వాణ్ని దింపుతూ, "రామేశ్వరం..." అన్నాడు.

"అక్కడ ఏముంటుంది... తాతయ్యా?"

"దేవుడుంటాడు.. బాబూ."

"చదువుకునే స్కూలూ అదీ వుంటుందా?"

"ఉహు" అని రామదాసు తల అడ్డంగా తిప్పాడు.

"తాతయ్యా! అయితే నన్నుకూడా తీసుకువెళ్ళు, అక్కడ ఆడుకునేందుకు మంచి పిల్లలుంటారు కాదూ?"

"ఉండరు బాబూ.. నువ్వొస్తావా? ఒద్దు బాబూ... ఒద్దు."

"పోనిలే ఎవరూ లేకపోతే... మనిద్దరమూ వున్నాంగా! యిద్దరం కథల్ని చెప్పుకుందాం..."

"మీ వాళ్ళు పంపరు బాబూ..."

"అమ్మను అడుగుతాను..."

కుర్రవాడి ఆతృత చూసి, "ఒద్దు బాబూ... ఒద్దు..." అన్నాడు.

వాడు ముఖం ముడిచి, "మళ్ళీ నువ్వెప్పుడొస్తావ్ తాతయ్యా?" అని అడిగాడు.

"యింకెప్పుడూ రాను..."

"నేనూ రానా... నీతోనే వుంటా తాతయ్యా! అల్లరి చెయ్యనుగా..."

ఏ సమాధానం చెప్పటం చేతకాక, వాణ్ని ఎత్తుకు ముద్దాడి "సరే రా బాబూ" అన్నాడు.

"తాతయ్యా! నన్నెప్పుడూ ముద్దు పెట్టుకుంటావ్ దేనికి?"

"ముద్దొస్తూంటావు బాబూ!"

"ఎందుకని?"

"నాక్కూడా నీలాటి కొడుకుండేవాడు నాయనా!"

"యిప్పుడెక్కడున్నాడు?"

దుఃఖాన్ని అణచుకుంటూ రామదాసు, "చచ్చిపొయ్యాడు బాబూ!" అన్నాడు.

వాడికేమీ అర్ధంకాక, "అంటే ఏంటి... తాతయ్యా?" అన్నాడు.

కుర్రవాడికి తెలిసే పదజాలాన్ని వెతుక్కుంటూ, రెండు చేతులూ పైకెత్తి ఆకాశంలోకి చూస్తూ, "అంటే... అక్కడ.. ఆకాశంలో వున్నాడు బాబూ!" అన్నాడు.

కుర్రవాడు ఆశ్చర్యాన్ని చూపుతూ, "తాతయ్యా! అక్కడికెల్లా ఎగిరాడు?" అని అడిగాడు.

"ఎగరరు బాబూ! దేవుడొచ్చి తీసుకుపోతాడు."

"దేనికి?"

"చచ్చిపొయ్యాక యిక్కడ వుండకూడదు.."

వాడికది అర్థమైందో లేదో కాని... ఒక విధాన తలతిప్పి అన్నాడు: "తాతయ్యా! మీ అబ్బాయ్ మంచివాడేనా?"

"ఆ, నీ మాదిరిగానే వుండేవాడు."

"నాతో ఆడుకుంటాడూ? వాడికి చెట్లెక్కటంవొచ్చా? తాతయ్యా! వాడి పేరేంటి?"

"చ...క్రి..."

వాడు నవ్వుతూ తప్పట్లుకొట్టి. "చక్రి! నా పేరేనా- వాడు నాకన్న పెద్దవాడా... తాతయ్యా?" అన్నాడు.

"అవును నాయనా!"

"అయితే వాడు పెద్దచక్రీ.. నేను చిన్నచక్రి కదు తాతయ్యా?"

"ఉ"

"తాతయ్యా! మనంకూడా ఆకాశంలోకి వెళ్ళిపోదాం. నేనూ మీ అబ్బాయీ కలిసి ఆడుకుంటాం. నేను వాడితో పోట్లాడను తాతయ్యా... నువ్వేమో.. యిద్దరికీ కథలు చెప్తువు గాని..."

రామదాసు వాడి అమాయకత్వానికి నవ్వుకొని, మెల్లిగా అన్నాడు: "ఎట్లా వెళ్దాం?"

"మీ అబ్బాయి ఎట్లా వెళ్ళాడు?"

"చచ్చిపోయి..."

"అయితే మనంకూడా చచ్చిపోయి వెళ్దాం..."

వాడికీ తనకూ అర్థమయ్యే భాష యీ ప్రపంచంలో లేదని రామదాసు "సరేలే!" అన్నాడు.

"ఎప్పుడు చచ్చిపోదాం?"

'అంత తేలిగ్గా చావొస్తే యింత కష్టముంటుందా?' అని లోలోపల అనుకొని "అట్లా అనకూడదు బాబూ!" అన్నాడు.

చక్రి బిక్కమొగంవేసి, "ఏం?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"తప్పు... పాపం"

"మీ అబ్బాయి ఎల్లా చచ్చిపొయ్యాడు? వాడికి పాపం కాదూ? తాతయ్యా నాకు తెలుసు... పాపం లేదు. మనం కూడా వెళ్ళిపోదాం తాతయ్యా..."

రామదాసుకు వివిధ విషయాలు జ్ఞాపకానికొచ్చి కళ్ళు రెండూ నీళ్ళతో నిండాయి. చక్రి తాతయ్యను యీ స్థితిలో యిదివరకెప్పుడూ చూడలేదు.

"తాతయ్యా... ఏడుస్తున్నావేం?"

'నా జీవితమే యింత బాబూ' అని లోలోపల అనుకొని, "కంట్లో నలకబడ్డది చక్రీ!" అని బొంకాడు.

"ఊదనా? నాకు మంత్రమొచ్చు తాతయ్యా! అమ్మకు వేశాను. నీక్కూడా వేస్తానుండు" అని గుప్పెడు గడ్డిపరకలు తీసుకొని, వాడి భాషలో ఏదో మంత్రాన్ని జపించుకుంటూ .. ఉఫ్... ఉఫ్! అని మంత్ర ప్రయోగం చేశాడు. ఆ మంత్ర మహత్యం యేమోకాని... ...రామదాసు రెండు నిమిషాల్లో... ఈ ప్రపంచంలోని మనిషవగలిగాడు.

8

ఆ పగలంతా చక్రి తాతయ్యతో ప్రయాణానికి కావలసిన సామాను సర్దుకో నారంభించాడు; కిందటి రోజుకొన్న అడివి మృగాల్నీ వాయిద్యాల్నీ కూడా బుల్లిసూట్కేసులో భద్రపరిచాడు... ఆ దేశ ప్రజలక్కూడా తన సర్కస్ కంపెనీని ప్రదర్శించితీరాలనే ఉద్దేశంతో! పెట్టెకు పట్టుకున్నన్ని గుడ్డల్ని కుక్కాడు... అదో సరదాతో.

"ఏమిట్రా యిది?" అని తల్లి అడిగింది.

"తాతయ్యతో ఊరికి వెళ్తా..."

ఆమె ఆశ్చర్యపోయి, "ఏవూరు?" అంది. వాడికి సరిగ్గా జ్ఞాపకం రా "అదా...; అదా ఊరే!" అన్నాడు.

"రామేశ్వరమా?"

"ఆ.. అక్కడికే!"

"ఏముందక్కడ? నువ్వెందుకు?"

"అబ్బ! అక్కడిక్కాదే! ఆకాశంలోకే..." ఆమెకు యిదంతా అగమ్యగోచరంగా వుంది; వాడికి మతిచలించిందో తాతయ్యకు మతి చలించిందో ఆమెకు అర్థమవలేదు.

విమాన ప్రయాణమే మోననుకొని, "ఆకాశంలోకా? దేనికి?" అంది.

"అక్కడే తాతయ్యగారి అబ్బాయీ... నేనూ ఆడుకుంటాం..'

"ఎట్లా వెళ్తారు?"

'ఎట్లాగా?' అని చేతులు తిప్పుతూ, కళ్ళు పెద్దవిచేసి "నీకు తెలీదు... చచ్చిపోయి వెళ్ళిపోతాం... నువ్వు కూడా వొస్తావా? నిన్ను తీసుకెళ్ళంలే..." అన్నాడు.

"ఛా! ఏమిటా మాటలు;"

ఆమె కళ్ళల్లోని కోపానికీ, ఆజ్ఞకూ చక్రి బిక్కమొగం వేశాడు.

ఆమె వెంటనే మాస్టార్ని పిలిపించి, "బాగుంది మీపాఠం. వాడికి చచ్చిపొమ్మనీ మీతో రమ్మనీ, బోధించినట్టున్నారు" అంది. మాస్టారికి ఏం చెప్పేందుకూ తోచక, ఎల్లాగో అన్నాడు; "లేదమ్మా; నాతో ఎందుకు తీసుకు వెళ్తాను?"

చక్రి తల్లి కాళ్ళకు పెనవేసుకొని, "నేను వెళ్తానే..." అని మారాంచేయసాగాడు.

ఆమెకు కోపంవొచ్చి, చేతిగాజులు గల్లుమనేట్టు... కొట్టేందుకు చెయ్యెత్తింది.

చక్రీ యీ అపాయాన్ని గుర్తించి ... వెంటనే తల్లిని వొదిలి బుసలు కొట్టుకుంటూ... తాతయ్య చాటుకువొచ్చి.. విజయసూచనగా పెద్దగా బాకాను పూరించి, 'నేను వెళ్తా... ఏం చేస్తావేంటి?' అని మొండిధైర్యాన్ని చూపించాడు.

రామదాసుకు పరిస్థితి బాగా అర్థమై "కుర్రవాడి విషయం నేను చూస్తాను.. మీరేం దిగులుపడక్కరలేదు..." అన్నాడు.

తన కొడుకు తనకే లొంగకపోవటం చూసి సిగ్గుతో రోషంతో ఎర్రబారిన ముఖంనుంచి వేడిగాలుల్ని విసురుతూ ఆమె నిష్క్రమించింది.

చక్రి, మాటమాటకూ ముళ్ళుతిరగని తన జపాన్ చేతిగడియారాన్ని చూస్తూ. "తాతయ్యా! టైమైంది... వెళ్దాంపా..." అనసాగాడు.

"యిప్పుడు కాదు... రాత్రికి"

ఎట్లాగో తాతయ్యమాటను తోసెయ్యక చక్రి అమిత ఓపికతో సూర్యాస్తమయం దాకా చూశాడు.

రాత్రి భోజనాలయ్యాక.... యధాప్రకారంగా గురుశిష్యులిద్దరూ గదిలో చేరారు; ఈ రాత్రి బండికే రామదాసు తన ప్రయాణాన్ని నిశ్చయించు కొన్నాడు; కాని, చక్రి రోజూకన్న ఎక్కువగా యీనాడు తాతయ్య చెంగుపట్టుకు వేళ్ళాడుతూ, నిమిష నిమిషానికీ, 'వెళ్దాంపా... తాతయ్యా!' అనటం మొదలుపెట్టాడు.

ఈనాడు తాతయ్యచెప్పే ఏ కథా వాడికి రుచించటంలేదు; వాడు ప్రయాణాన్ని గూర్చిన సమస్యతోనే తన బుల్లి బుర్రకు పని కల్పించాడు.

చక్రిని తనతో కూడా తీసుకుపోయి శిధిలమవంగా మిగిలిన జీవితాన్ని, శాంతంగా గడుపుదామనే ఊహ రామదాసులోకి జొరబడ్డది. కాని తన చేతుల్లో ఏ బిడ్డ సరిగ్గా బతికింది? అది తన హస్తాల చలవేనేమో! తన బిడ్డంటే మృత్యుదేవతకు అమిత ఆదరమాయె! తన చక్రిని పోగొట్టుకొని... పరాయి చక్రిని తీసుకుపోయి చూస్తూ చూస్తూ చేతులారా మృత్యుదేవిముఖానికి అందిచ్చేందుకు తన మనస్సెల్లాగు ఒప్పటంలేదు. స్వార్థానికై యీ చక్రిని ఎవరికీ తెలీకుండా ఎత్తుకుపోతే... వాడి తలిదండ్రులు దుఃఖంచరా? తన ఏకైక చక్రి పోయినప్పుడు తనెంత కృంగి కృశించాడు! ఎవరి బిడ్డ వారికంతేగా? ఛీ! యిది దొంగతనం! తనకింకెవరున్నారు? తనింకా ఎక్కువకాలం జీవించే ఆశ తనకు లేదాయె! తనతో చక్రిని తీసుకుపోయి తన మరణానంతరం వాడి జీవితాన్ని పాడుచెయ్యటం దేనికి? మొదట్నుంచీ చక్రి తల్లి తనను అనుమానిస్తూనే వుందాయె! ఈ పరిస్థితుల్లో వాణ్ని వెంటపెట్టుకు వెళ్ళటం చేతులారా గొంతుకు ఉరితాటిని తగిలించుకోవటమే!

చివరకు, రామదాసు... చక్రికి తెలీకుండా రైలెక్కాలనే దృఢనిశ్చయానికొచ్చాడు.

బైట జోరుగా వాన కురుస్తోంది. తెరలు తెరలుగా గాలి వీస్తోంది.

"తాతయ్య.. వెళ్దామా?" చక్రి యీ పాటను వదిలేట్టు లేడు.

"యిప్పుడు బండిలేదు బాబూ! తెల్లవారుజామున..."

యింతవరకూ గురువాక్యాలమీద వాడికి విశ్వాసం వుంది కాని... యీ తుది వాయిదానుమాత్రం వాడు నమ్మలేకపోయాడు. తాతయ్య తనను మోసంచేస్తున్నాడని వాడికెవరో చెప్తుతున్నట్టుంది.

"అబద్ధాలు... తాతయ్యా... నేను నిద్రపొయ్యాక నన్ను విడిచిపెట్టి వెళ్ళిపోతావా?"

యిదికూడా వాడు కనిపెట్టాడు. నిజమే! వాడికి తెలీకుండానే పారిపోవాలి! తప్పదు! లోకంలో ఎన్ని సంయోగ వియోగాలు కలగటం లేదు? అందులో యిదొకటి! ఈ వేదాంతం తెలీని చక్రి తనకోసం కొన్నాళ్ళపాటు దుఃఖంచినా వాడి భావిజీవితం రాణిస్తుంది. తన ముసలి వాసనా, తన పాడుస్నేహమే వాణ్ణి పాడుచేస్తున్నాయ్యేమో! ఎందుకో ఆ ముసలి ప్రాణి మీద వాడికంత అపేక్ష? భగవంతుడే యీ చక్రి దగ్గరకు తనను జేర్చాడు... యిప్పుడు విడదీస్తున్నాడు; దీనికి ఎవరేం చెయ్యగలరు?

ఈ ఆందోళనను మరుగుపరుచుకుంటూ, "లేదు బాబూ! చూడు. బైటెల్లా వాన కురుస్తోందో; గాలి ఎల్లా కొడుతోందో? మనం యిప్పుడు బైటకెడితే తడిసిపోతాం" అన్నాడు.

"యిదుగో... మనకు గొడుగు" అని బుల్లి జపాన్ గొడుగు తెరిచాడు.

"అది గాలికి ఎగిరిపోతుంది... రేపు వెళ్దాం. పోనీ... బైట ఎవరైనా నడుస్తున్నారేమో చూడు."

చక్రి కిటికీలోంచి చూశాడు. బైట ఆ అర్ధరాత్రి ఎవ్వరూ లేరు. తాతయ్య చెప్పేది నిజమేననుకున్నాడు. అయినా వాణ్ని ఏదో అనుమాన పిశాచం పట్టుకు పీడిస్తూనే వుంది.

"రేపు తప్పకుండా వెళ్ళాలి... తాతయ్యా" తాతయ్యకు ఒక్కడికే చావుకుమార్గం తెలుసుననే వాడికి నమ్మకం!

'స...రే'

గడియారం పదకొండు గంటల్నీ భయంకరంగా కొట్టింది. చక్రి యీ ముసలితాతను వీడలేక... తనను విడిచివెళ్తాడేమోనని యింతవరకూ కళ్ళల్లో వొత్తులువేసుకు మేకులాగు మేలుకొనే కూర్చున్నాడు. యింక వాడి కనురెప్పలు తెరుచుకుండేందుకు ఒప్పుకోవటంలా. గుంపులు గుంపులుగా వాడి నోటివెంట వొచ్చే ఆవలింతల్ని చూసి రామదాసు, "యింక పడుకోబాబూ!" అన్నాడు.

"నువ్వుకూడా నా దగ్గర పడుకో తాతయ్యా..."

రామదాసు చక్రి యీ తుది కోరికను కాదనలేకపొయ్యాడు. వాడి దగ్గరే పడుకున్నాడు. వాడి శరీరానికి చలిగాలి తగలకుండా దుప్పటి కప్పాడు. తాతయ్యనూ, ప్రయాణాన్నీ కూడా మరిచిపోయి నిద్రాదేవి కౌగిట్లోని పారవశతను పూర్తిగా అనుభవించసాగాడు. కరుచుకు పడుకున్నవాడల్లా రామదాసుకు కొద్దికొద్దిగా సందివ్వసాగాడు. యిదే తనను భగవంతుడే వొచ్చి ఆ స్థలాన్ని వీడమని ఆజ్ఞాపిస్తూన్నట్టు రామదాసు తలిచాడు.

'ఉదయాన లేచి, చూసుకుంటాడు. తను నమ్మిన తాతయ్య చేసిన మోసం గుర్తించి ఏడుస్తాడు. ముసలివాణ్ని తిట్టుకుంటాడు. యింక యీ ముసలి తాతయ్య నీకు కన్పించడు బాబూ ! నిన్ను రేపట్నుంచి ఎత్తుకునేవాళ్ళూ, ఆడించేవాళ్లూ వుండరు నాయనా ! యివన్నీ నువ్వు మరిచిపోవాలి. ఈ కఠిన విధికి అందరమూ బద్ధులమేగా చక్రీ, యింక యీ తాతయ్య- యీ జీవితానికి యిదే నిన్ను కడసారి చూడటం' అనుకొని, యీ వినూత్న శాంతిమయ జీవితాన్ని తల్చుకొని దుఃఖిస్తూ, తన చిన్న చేతిసంచీని తీసుకున్నాడు.

కుర్రవాడు యిదంతా చూస్తూన్నట్టే నిద్రలోనే బుగ్గలు గుంటలు పడేట్టు నవ్వాడు. రామదాసు వెంటనే వాడి మంచంమీద కూర్చొని, వాణ్ని తుదిసారి ముద్దుపెట్టుకొని, వాడి అభివృద్ధికోసం కడసారి దీవించాడు.

గడియారం అరగంట కొట్టిన కఠోరశబ్దమూ, బైట వానా, గాలీ కలిసిచేసే ధ్వనీ విన్పిస్తున్నాయ్. గది మూలనున్న సన్నని దీపం అదిరదిరిపడుతోంది. ఎక్కడో గుడ్లగూబ అరుస్తోంది కాని, ఆ శబ్దం వాన శబ్దంలో మిళితమై స్పష్టంగా లేదు.

కళ్ళనీళ్ళు తుడుచుకొని, ఎవరితోనూ చెప్పకుండానే రామదాసు బైటపడ్డాడు. ఏ బుద్ధ భగవానుడు ఆ కాళరాత్రిన - నిద్రిస్తూన్న భార్యకూ, పుత్రుడికీ కూడా తీరని ద్రోహం చేసి పారిపోయిన ఘట్టం జ్ఞాపకానికొచ్చింది. చక్రికి తీరని ఘోరాన్యాయాన్ని చేసి... లోకంలో పాపుల్లోకల్లా తనే పాపి ననుకుంటూ, ఆ చీకటి సముద్రంలో తప్పటడుగుల్తో, బరువైన హృదయంతో నడిచిపోసాగాడు.

చక్రి కలతనిద్రలో, 'తాతయ్యా!... తాతయ్యా!' అని కలవరించాడు. ఆ గది గోడలు మాత్రమే యిది విని, నవ్వుకున్నాయ్.

(ఒక బెంగాలీకథ చదివి)

- జనవరి 1945